మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## రాష్ట్ర గవర్నర్ తిమిళిసై సౌందర రాజన్‌కు స్వాగతం పలికిన కలెక్టర్ వల్లూరి క్రాంతి



**అమీన్‌పూర్, మార్చి5 ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజకవర్గంలోని పటేల్‌గూడ లో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళసై సౌందర రాజన్, దేవాదాయ శాఖ మంత్రి, సంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖలకు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

## పారిశుధ్య కార్మికులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలి

### -ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

**వెల్దుర్తి, మార్చి5 ప్రభాతవార్త:**

పారిశుధ్య కార్మికులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన మాసాయిపేటలో మంగళవారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల చేరికల సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పారిశుధ్య కార్మికులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉన్నత స్థాయి ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు నాలుగు రోజులు ఆలస్యంగా ఇచ్చినా ఇబ్బంది ఉండదని, పారిశుధ్య కార్మికులకు సమయానికి జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో యువసేన రాష్ట్ర అధ్యక్షులు రమేష్, ఉపాధ్యక్షులు కృష్ణ, జిల్లా నాయకులు హరిప్రసాద్, భిక్షపతి, సాయిబాబా, లింగం, స్వామి, స్టేషన్ బాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

### 5 మున్సిపాలిటీలు, 23 ఎంపిడిఓ కార్యాలయాలలో

## ప్రజా పాలన సేవ కేంద్రాలు ఏర్పాటు

### జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 5 మున్సిపాలిటీలు, 23 ఎంపిడిఓ కార్యాలయాలలో ప్రజాపాలన సేవ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలనుంచి సంబంధిత గుర్తింపుకార్డులను సేకరించి నిర్దేశిత సమయం లోనే అవసరమైనవారి డాటా దిద్దుబాటు చేస్తామని రాష్ట్రస్థాయి అధికారు లకు జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తెలిపారు. మంగళవారం నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. గృహజ్యోతి, మహాలక్ష్మీ పథకం ద్వారా లబ్ధిపొందేందుకు అర్హతగల గ్రామీణ ప్రాంత లబ్ధిదారులు ఎంపిడివో కార్యాలయాలు, పట్టణ ప్రాంతాల లబ్దిదారులు మున్సిపల్ కార్యాలయాలలో అధార్ కార్డు, రేషన్ కార్డు, విద్యుత్ బిల్లు, గ్యాస్ పాస్ బుక్‌లతో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదర తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సాంకేతిక విధానంపై రైతులకు అవగాహన కల్పించనున్న సిఎం

**చేర్యాల, మార్చి 5, ప్రభాతవార్త :** రైతులకు ఆధునిక సాంకేతిక విధానంపై సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.డి.అఫ్రోజ్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం (నేడు) పట్టణ కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రైతులకు అవగాహన కల్పిస్తారని ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు. అలాగే ప్రజాప్రతినిధులు, రైతు సోదరులు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని సూచించారు.

## రెవెన్యూ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

### మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్




రెవెన్యూ మేళాను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజితవెంకన్న

**హుస్నాబాద్, మార్చి 5, ప్రభాతవార్త :** హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ రెవెన్యూ మేళా కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఈ మేళాలో ఇల్లు ఉండి, ఇంటి పన్నులు ఆన్‌లైన్‌లో ఎంట్రి కాకపోవడం, హెచ్చుగా రావడం, బకాయిల వన్‌టైమ్ సెటిల్ మెంట్, ఆన్‌లైన్‌లో పేర్ల తప్పుల సవరణ, రిజిస్ట్రేషన్ పేర్ల మార్పిడి, ఇంటి నంబర్‌లతో పాటు రెవెన్యూ విభాగంలో ఎలాంటి సమస్య ఉన్నా ఈ మేళాలో పరిష్కరించుకోవచ్చన్నారు. ఇందుకు గతంలో చెల్లించిన ఇంటి పన్నుల రశీదు, రిజిస్ట్రేషన్ డాక్యూమెంట్లు,లింకు డాక్యూమెంట్లు, ఈసి,ఇంటి ఫోటో,పర్మిషన్‌లు తీసుకువచ్చుకుని ఈనెల 30లోపు ప్రతీ ఆది,మంగళ,గురువారాలలో ఉదయం 10 గంటల 30నిమిషాల నుండి మధ్యాహ్నం 1.30వరకు మున్సిపల్ కార్యాలయంలో జరగే మేళాలో సమర్పించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ బోజు రమాదేవిరవిందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## 'వార్త' కథనంపై ఇంటిలిజన్స్ అధికారుల ఆరా

**హత్నూర మార్చి 5, ప్రభాతవార్త:** వార్త దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. హత్నూర మండలం దౌలాపూర్ గ్రామం పరిధిలో ఏర్పాటు చేసిన వెంచర్ యజమాన్యం ప్రభుత్వ అసైన్డ్ భూమిని అక్రమించుకొని వెంచర్ అవసరాలకు వాడుకుంటుందని మంగళవారం వార్త దినపత్రికలో ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి శీర్షికతో ప్రచురితమైన విషయం తెలిసిందే.దీనిపై ఇంటలిజన్స్ అధికారులు ఆరాతీశారు. వెంచర్ ఏర్పాటు, ప్రభుత్వ భూమీ వివరాలను సేకరించారు.ప్రభుత్వ భూమీని ఎవరికి,ఎప్పుడు అసైన్డ్ చేశారు.ప్రస్తుతం ఆభూమి ఎవరిస్వాధీనంలో ఉన్నది అనే తదితర వివరాలను సేకరించారు.తదుపరి ఏలాంటి చర్యలు ఉంటాయో వేచిచుడాలి.

## 'పది' పరీక్షలపై దృష్టి సారించండి

### జిల్లా విద్యాధికారి రాధాకిషన్

**చిన్నశంకరంపేట,మార్చి 5,ప్రభాతవార్త:** పదవతరగతి విద్యార్థులు ప్రణాళిక బద్దంగా చదువుకుంటే సులువుగా పదిలో మంచి ఫలితాలు సాదించవచ్చని జిల్లా విద్యాధికారి రాధా కిషన్ తెలిపారు. మంగళవారం చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పదవతరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పదవ తరగతి పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున, ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు నిత్యం పాఠశాలకు వచ్చి ఎలాంటి సందేహాలున్నా వాటిని నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

# రసాబాసగా మున్సిపల్ బడ్జెట్ సమావేశం

### ఎమ్మెల్యే సమక్షంలోనే చైర్మన్-కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం... 4 ఏళ్లలో పట్టణంలో చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని కౌన్సిలర్‌ల డిమాండ్

**రామాయంపేట మున్సిపాలిటీ, మార్చి 5, ప్రభాతవార్త**

రామాయంపేట మున్సిపల్ బడ్జెట్ సమావేశం రసాబాసాగా సాగింది. మంగళవారం నాడు మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ముఖ్యఅతిథిగా వచ్చారు. సమావేశం మొదలవగానే అధికారులు బడ్జెట్ ఆదాయ, వ్యయాలను బడ్జెట్ వివరాలను చదివి కౌన్సిల్‌ముందుంచారు. అనంతరం అన్ని వార్డుల కౌన్సిలర్‌లకు మాట్లాడూ అవకాశం ఇవ్వాలంటూ కౌన్సిలర్‌లు కోరారు. 1వ, 2వ వార్డులలో నీటి సమస్య ఉందని, అట్టి సమస్యను పరిష్కరించాలని ఆయా వార్డుల కౌన్సిలర్‌లు బొర్ర అనిల్‌కుమార్, సుందర్‌సింగ్‌లు కోరారు. 4వ వార్డు కౌన్సిలర్ గజవాడ నాగరాజు మాట్లాడుతూ ఎంతో కాలంగా పట్టణంలో సమస్యగా ఉన్న ఆధార్‌సెంటర్‌ను ఏర్పాటు చేసినందుకుగాను ఎమ్మెల్యే రోహిత్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. తన వార్డు పరిధిలో రోడ్లు, మురికికాలువల సమస్య తీవ్రంగా ఉన్నట్లు తెలిపారు. 5వ వార్డు పట్టణం లోనే పెద్దదని అందుకు అభివృద్ధి కోసం నిధులు ఎక్కువగా కేటాయించాలని ఆ వార్డు కౌన్సిలర్ చంద్రపు శోభ కొండల్‌రెడ్డి తెలిపారు. 6వ వార్డు కౌన్సిలర్ దేమె యాదగిరి మాట్లాడుతూ 4 ఏళ్లుగా రామాయంపేట పట్టణం అభివృద్దిలో మరుగున పడిందని అన్నారు. అందుకు చైర్మెన్ కల్పించుకొని 4ఏళ్లుగా తమరు కౌన్సిలర్‌గానే పాలకమండలిలో ఉన్నారు కదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో చైర్మెన్ వైకుంఠరథం స్వంత ఖర్చులతో ఏర్పాటుచేస్తానని, ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని అన్నారు. అంతేకాకుండా పట్టణంలోని బస్టాండ్‌లో కంట్రోలర్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, బస్టాండ్‌లో రాత్రి సమయంలో లైట్స్ లేవని అందుకు ఎమ్మెల్యే గారు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. అలాగే వాటర్ మెయింటెనెన్స్‌ను ఏజెన్సీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. 7వ, 9వ, 10వ వార్డు కౌన్సిలర్లు మల్యాల కవితా కిషన్, దేవుని జయరాజు, చింతల రాధాభవాని యాదగిరిలు తమ వార్డులలో కూడా పలు సమస్యలున్నట్లు సభదృష్టికి తెచ్చారు. 11వార్డు కౌన్సిలర్ చిలుక గంగాధర్ మాట్లాడం మొదలు పెడుతూనే గతంలో ఉన్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఒక్కసారి కూడా బడ్జెట్ సమావేశానికి రాకపోవడం సిగ్గుచేటని, పరుష పదజాలంతో అనడంతో చైర్మెన్‌తో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు సభలో పద్ధతిగా మాట్లాడాలని లేవడంతో ఒక్కసారిగా సభ వేడెక్కింది. అంతటితో ఆగకుండా కౌన్సిలర్ చిలుక గంగాధర్ తీవ్ర ఆవేశంతో ఊగిపోతూ చైర్మెన్‌పై విరుచుకుపడ్డారు. 4ఏళ్లుగా పట్టణంలో చేసిన అభివృద్ధి ఏంటో చైర్మెన్ చెప్పాలని డిమాండ్ చేశారు. తాము గెలిచి చైర్మెన్‌ను ఎన్నుకున్నప్పుడు అందరం అన్నాదమ్ముల వలే కలిసిఉండి, అందరం కలిసి రామాయంపేట పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారని కాని అవి కేవలం తమను మభ్య పెట్టడానికేనని, మున్సిపాలిటీలో అన్నీ తను అనుకున్నట్లుగానే చేశారని మండిపడ్డారు. ఏదో కంపెనీ వస్తుందని, పట్టణంలోని యువకులకు ఉద్యోగాలు వస్తాయని మభ్యపెట్టారని దుయ్యబట్టారు. అంతే కాకుండా ఇటీవల పట్టణంలో పేదలకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణిలో అవకతవకలు జరిగాయని అన్నారు. అలాగే పట్టణంలో ఇంటిపన్నుల విషయంలో కూడా అవకతవకలు ఉన్నాయని అన్నారు. చైర్మెన్‌ను మారిస్తే గాని పట్టణం అభివృద్ధి జరగదని, అందుకు కౌన్సిలర్‌లు అందరూ సహకరించి చైర్మెన్‌పై అవిశ్వాసానికి సహకరించాలని కోరారు. సుమారు గంటన్నర పాటు సాగిన ఈ వాగ్వాదంలో చైర్మెన్ ఒక వైపు ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన నలుగురు కౌన్సిలర్లు ఒకవైపుగా రసాబాసా సాగింది. కాగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సమక్షంలోనే ఇదంతా జరుగుతున్నా ఎమ్మెల్యే మాత్రం చివరిగా కౌన్సిలర్‌లు వారిలో ఉన్న బాధతోనే మాట్లాడారని, ఆ మాటలలో ఏవైనా వ్యక్తిగత దూషణలు ఉంటే వాటిని రికార్డులలోనుండి తొలగించాలని అక్కడే ఉన్న మున్సిపల్ కమీషనర్‌తో చెప్పడం కొసమెరుపు.



మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో చైర్మెన్‌కు, కౌన్సిలర్‌లకు మధ్య వాగ్వాదం దృశ్యం

## 2024-25 ఆర్థిక సంవత్సరానికి ముగిసిన మున్సిపల్ బడ్జెట్ సమావేశం

**రామాయంపేట మున్సిపాలిటీ, మార్చి 5, ప్రభాతవార్త**

రామాయంపేట మున్సిపాలిటీ 2024-25 బడ్జెట్ సమావేశం మంగళవారం నాడు ముగిసింది. మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు హాజరయ్యారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారి మున్సిపాలిటీకి వచ్చిన రోహిత్‌రావును చైర్మెన్‌తో పాటు పాలకమండలి సభ్యులు ఘనంగా స్వాగతం పలికి, శాలువాలు, పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రారంభమైన బడ్జెట్ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ దేవేందర్ ఆదేశానుసారం అకౌంటెంట్ బడ్జెట్‌ను కౌన్సిల్‌కు చదివివినిపించారు. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్,

### ఆదాయ, వ్యయాలను కౌన్సిల్ ముందుంచిన అధికారులు...

2023-24 సవరించిన బడ్జెట్ కేటాయింపులు ఇలా ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి అంచనా వేసిన మొత్తం ఆదాయం (సాధారణ నిధులు, గ్రాంట్లు కలుపుకొని) రూ.2551.71లక్షలు. అంచనా వేసిన మొత్తం వ్యయం(సాధారణ మరియు గ్రాంట్లు) రూ.2551.30 లక్షలు. అంచనా వేసిన మున్సిపల్ సాధారణ ఆదాయము రూ.312.35లక్షలు (పన్నుల ద్వారా రూ.115 లక్షలు మరియు పన్నేతరముల ద్వారా రూ.197.35లక్షలు). అంచనావేసిన మున్సిపల్ సాధారణ వ్యయము రూ.311.94లక్షలు(చార్టర్డ్ వ్యయము రూ.266.08 లక్షలు, ఇతర నిర్వహణ వ్యయము రూ.45.66లక్షలు, అభివృద్ధి పనుల కొరకు రూ.0.20లక్షలు). అంచనావేసిన ఆదాయం గ్రాంట్ల ద్వారా రూ.2239.36 లక్షలు. వ్యయము గ్రాంట్ల ద్వారా రూ.2239.36 లక్షలు. 10శాతం గ్రీన్ బడ్జెట్ కొరకు కేటాయించిన సాధారణ నిధులు రూ.48.36 లక్షలు. చార్జెడ్ ఎక్స్‌పెండీచర్ కొరకు కేటాయించిన సాధారణ నిధులు రూ.266.08 లక్షలు. 1/3 బ్యాలెన్స్ కొరకు కేటాయించిన సాధా రణ నిదులు రూ.0.20 లక్షలు. ఇంజనీరింగ్ విభా గపు వ్యయము సాధారణ పరిపాలన కొరకు కేటా యించిన సాధారణ నిధులు రూ.45.66 లక్షలు. వార్డుల అభివృద్ధి కొరకు కేటాయించబడిన అంచనా సాధారణ నిధులు రూ.0.20 లక్షలు. గా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## కుర్తివాడ గ్రామంలో భూ తగాదాలు..ఒకరి మృతి

**పాపన్నపేట, మార్చి 5, ప్రభాతవార్త:**

భూ తగాదాల ఘర్షణలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కుర్తీవాడలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... కుర్తీవాడ గ్రామానికి చెందిన మెట్టు రాములు కుమారుడు లక్ష్మయ్య (36) రాములు సహోదరి మెట్టు సావిత్రి ఇంటికి ఇల్లరికం వెళ్లాడు. గ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని సాకుతున్నాడన్నారు. భూమి విషయంలో ఇరు కుటుంబాల మధ్య తరుచూ గొడవలు జరుగుతూ వస్తున్నాయన్నారు. సోమవారం సాయంత్రం లక్ష్మయ్య ఇంటి వద్ద గొడవలు ఆరంభం కావడంతో సావిత్రి కుటుంబీకులు లక్ష్మయ్యపై దాడి చేయడంతో అందుకు అడ్డుగా వచ్చిన అల్లాదుర్గం నర్సింలు, దత్తులు రాములుపై దాడి చేసి పక్కనే ఉన్న గ్రైనేట్ రాయితో దాడి చేశారన్నారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి, పరిస్థితి విషమించడంతో గాంధీ ఆసుపత్రికి తరలించామన్నారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ మంగళవారం తిరిగిరాని లోకాలకు చేరిపోయినట్లు పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కేశవులు పేర్కొన్నారు.



భూతగాదాలపై విచారిస్తున్న పోలీసులు

# సదాశివపల్లికి కదిలివచ్చిన జిల్లా యంత్రాంగం

### -రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు.. ఘటన స్థలాన్ని సందర్శించిన డిఎఓ, ఐబి డిఈఈ, సిఐ, తహసీల్దార్

**'వార్త'కు స్పందన**

**కౌడిపల్లి, మార్చి 5, ప్రభాతవార్త:**

ఆరుగాలం కష్టపడి పండించిన పంట దిగుబడులను రవాణ చేయటంలో రైతులకు ఇబ్బందులు కల్గిస్తే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్, చెరువుకట్టకు ఎలాంటి ఆటంకం కలగకుండా రైతు తన పంటలను తీసుకెళ్లటానికి ర్యాంపు చేసుకోవచ్చని ఇరిగేషన్ శాఖ డిఈఈ జగన్నాథం పేర్కొన్నారు. సోమవారం జిల్లా ఉన్నతాధికారులు మండల పరిధిలోని సదాశివపల్లి గ్రామ కనికాల చెరువు కట్టను సందర్శించి, చెరుకు తోటను కాలపెట్టుకోని తీవ్రంగా నష్టపోయిన రైతును విచారించారు. ఆదివారం 'వార్త'లో 'నిస్సహాయంతో చెరుకు తోటకు నిప్ప ంటించిన రైతు' కథనం ప్రచురితం కాగా స్పందించిన జిల్లా వ్యవసాయాధికారి గోవింద్, ఇరిగేషన్ శాఖ డిఈఈ జగన్నాథం, ఎఈ రవిమోహన్, తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శ్రీహరి, నర్సాపూర్ సిఐ జానారెడ్డి, కౌడిపల్లి ఎస్సై రంజీత్‌కుమార్‌లు ఘటన స్థలాన్ని సందర్శించి, నిజ నిజాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఎఓ గోవింద్ మాట్లాడుతూ వాస్తవానికి రైతు క్రిష్ణాగౌడ్‌కు పొలం నుండి పండించిన చెరుకు పంటను రవాణ చేయుటకు చెరువు కట్టకింద ర్యాంపు చేసుకోవడంలో ఎలాంటి ప్రమాదం లేదని తేలిందన్నారు. వెంటనే జేసిబి సహాయంతో బాధిత రైతు పొలం నుండి కట్ట పైకి ర్యాంపు చేసి ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే కాలిన చెరుకును సంగారెడ్డి చెరుకు కర్మాగారం యజమాని తీసుకోనెలా అనుమతి పత్రాలను ఇవ్వడం జరుగుతుందని ఆయన చెప్పారు. తహసీల్దార్ ఆంజనేయులు మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలిగే అంశాలు ఏమైన ఉంటే తన దృష్టికి తీసుకొస్తే న్యాయంచేయగలని ఆయన హామీ ఇచ్చారు. ఐబి డిఈఈ జగన్నాథం మాట్లాడుతూ చెరువు కట్ట కింద భాగాన్ని జేసిబి సహాయంతో ధ్వంసం చేసిన విషయం మా దృష్టికి రైతు తీసుకురాలేదని, ఇప్పటికైనా ఆయకట్ట కింద ఉన్న రైతులు చెరువుకట్ట పట్టిష్టతకు ఎలాంటి ఆటంకం కల్గించకుండా తాత్కాలిక ర్యాంపు చేసి, పంటలను రావాణ చేసిన తర్వాత తిరిగి కట్టను పునర్ధరీకరణ చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతు కుటుంబీకులు, బిజేపి జిల్లా ఉపాధ్యక్షుడు కాజిపేట రాజేందర్, మ ండల అధ్యక్షుడు రాఖేష్, వెల్మకన్నె, సదాశివపల్లి గ్రామ రైతులు తదితరలు పాల్గొన్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఎఓ గోవింద్, తహసీల్దార్ ఆంజనేయులు, ఐబి డిఈఈ జగన్నాథం




మాట్లాడుతున్న సీపీ డా॥అనురాధ

## స్త్రీలను గౌరవించినప్పుడే సమాజం అభివృద్ధి

### సీపీ డా. అనురాధ

**సిద్దిపేట రూరల్(చిన్నకోడూరు), మార్చి 5, ప్రభాతవార్త :**

ఉమెన్ ఎంపవర్మెంట్, మహిళ సాధికారిక పూర్తిస్థాయిలో సాధించినప్పుడే దేశం మరింత అభివృద్ధి పథంలో నడుస్తుందని సీపీ డా॥అనురాధ అన్నారు. చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు గ్రామ శివారులోని మహిళా పాలిటెక్నిక్ కాలేజీలో యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఉమెన్స్ డే సందర్భంగా మంగళవారం నిర్వహించిన మహిళా సాధికారిక కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు మహిళా సాధికారతకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు సైబర్ నేరాలు ఇవిటీజింగ్, ఫోక్స్, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచే ఏమి కావాలో ఏమి సాధించాలో ప్రతి ఒక్కరూ రోల్ క్వాలిటి, గోల్ క్వాలిటీ కలిగి ఉండాలన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ఇష్టపడి చదువుతూ ఏర్పరుచుకున్న గోల్ సాధించాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరం జరిగితే వెంటనే జాతీయ సైబర్ సెల్ టోల్ ఫ్రీ నంబర్ 1930 ఫోన్ చేయాలన్నారు. యూనియన్ బ్యాంక్ అధ్వర్యంలో మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు ఎల్ఈడీ టీవీని సీపీ చేతుల మీదుగా బహుకరించారు. యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ వికాస్, డిప్యూటీ వీరరాఘవ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిల్ స్నేహలత, సంజయ్ కుమార్ చౌదరి, ముఖేష్. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొండపాక ఎంపిపిపై అవిశ్వాస తీర్మానం



ఎంపిపిపై అవిశ్వాస తీర్మాన పత్రాన్ని ఆర్డీఒకు అందిస్తున్న ఎంపిటీసీలు

**కొండపాక, మార్చి 5, ప్రభాతవార్త :** ఎంపిపి ర్యాగల సుగుణపై మంగళవారం కొంతమంది ఎంపిటీసిలు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టారు. తీర్మాన పత్రాన్ని గజ్వేల్ ఆర్డీఒ బన్సీలాల్‌కు అందించారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టినవారిలో కొండపాక ఎంపిటీసీలు మం చాల కనకరాములు, అరుట్ల లక్ష్మి, దుద్దెడ ఎంపిటీసీలు గురజాడ బాలాజీ, పిల్లి శిరీష, సిర్సనగండ్ల నందాల శ్రీనివాస్, మేదినిపూర్ విరు పాక లావణ్య, కుకునూరుపల్లి భూరమైన భూములుగౌడ్, వెలకట్ట చింతల సాయిబాబా, మర్పడ్గ పత్తి అంజనేయులు తదితర ఎంపిటీసీలు పాల్గొన్నారు.

**విశేషం ఎమిటంటే...**

ప్రస్తుతం ఉన్న ఎంపిపి ర్యాగల సుగుణ టిఆర్ఎస్ పార్టీ నుండి ఎన్నుకోబడ్డారు. ఈ రోజు తీర్మానం ప్రవేశపెట్టిన వారిలో 7 ఎంపిటీసిలు ఉండడం గమనార్హం. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒకరు, బిజెపికి చెందిన ఎంపిటీసి ఒకరు ఉన్నారు.

### ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 51 శాతం ఫిట్‌మెంట్‌తోకూడిన

## పిఆర్‌సి అమలు చేయాలి

### -పిఆర్‌టియూ రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి



పిఆర్‌సి చైర్మెన్ ఐఏఎస్ విశ్రాంతి శివశంకర్ పిఆర్‌సి 51% పిట్మెంట్ చెల్లించాలంటు ప్రతిపాదనలను సమర్పిస్తున్న పిఆర్‌టియూ నేతలు

**కౌడిపల్లి, మార్చి 5 ప్రభాతవార్త :** రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 51 శాతం పిట్‌మెంట్‌తోకూడిన పిఆర్‌సిని వెంటనే అమలుచేయాలంటూ పిఆర్‌టియూ వ్యవస్థాపక అధ్యక్షుడు, టిపిసిసి అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణతో కలిసి పిఆర్ టియూ అసోషియన్ అధ్యక్షులు ఓంప్రకాశ్ ఆర్‌సి కార్యాలయంలో చైర్మన్, ఐఎఎస్ విశ్రాంతి ఉద్యోగి ఎన్.శివశంకర్‌కు ప్రతిపాదనలను సోమవారం అందించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎస్ఎ, ఎస్‌జి టిలకు వేతనంలో ఉన్న తేడాను తగ్గించాలన్నారు. ఎజేన్సీ ప్రాంతాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు తప్పకుండా ఎజెన్సీ అలవెన్స్‌లు అందించాలని, ఉద్యోగి తల్లి, తండ్రి మరిణిస్తే నిర్వహించే కర్మకాండలను మానవీయ ధృపథంతో 11 రోజుల వేతనంతోపాటు సెలవులు మంజూరుచేయాలని ఆయన కోరారు. మహిళ ఉద్యోగులు ప్రసవ సెలవులతోపాటు పిల్లల సంరక్షణ కింద మరో 90 రోజులతో కలిపి 180 రోజుల సెలవులను కల్పించాలని ఆయన అన్నారు. ఉద్యోగి చనిపోతే, వారి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం చేసేవరకు కనీస వేతనంతో కూడిన జీతం చెల్లించాలని ఈ ప్రధానమైన డిమాండ్‌లతో కూడిన ప్రతిపాదనలను పిఆర్‌సి చైర్మన్‌కు అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు మంచిరెడ్డి అనంతరెడ్డి, ఓంప్రకాశ్, బాలాజీ, శ్రీనివాస రావు, బాల్‌రెడ్డి, శ్రీశైలం, మల్లేశ్, చక్రపాణి, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

## డ్రా పద్ధతితో మున్సిపల్ గదుల కేటాయింపు

**హుస్నాబాద్, మార్చి 5,ప్రభాతవార్త**

హుస్నాబాద్ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తాలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లేక్స్‌లోని మూడు అంతస్థులలో ఖాళీగా ఉన్న 17 దుఖాణాలకు (ఫిక్స్‌డ్ రేట్)తో అద్దె ప్రాతిపాదికన రెండు సంవత్సరాల కాల పరిమితితో ఈనెల 13వ తేదీన డ్రా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కాంప్లేక్స్‌లో దుఖానాలు కావాల్సిన వారు నేటి నుండి తేది 6నుండి 12వ తేదీ సాయంత్రం 4గంటల లోపు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు ఫారంతో పాటు 2వేలు చెల్లించాలని సూచించారు.పూర్తి వివరాలకోసం నేటి నుండి కార్యాలయ పని వేళల్లో రెవెన్యూ అధికారిని సంప్రదించాలని సూచించారు.డ్రా పద్దతిలో దుఖానాలు పొందిన వారు 6నెలల అద్దె ముందుగానే చెల్లించాల్సి ఉంటుందన్నారు.

## విజయ సంకల్ప సభకు తరలివెళ్ళిన బిజెపి శ్రేణులు



మర్కుక్ మండలం నుండి తరలివెళ్తున్న బిజెపి శ్రేణులు

**మర్కుక్, మార్చి 5 (ప్రభాతవార్త):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ప్రధానమంత్రి నరేంద్రమోడి విజయ సంకల్ప సభకు బిజెపి మండల పార్టీ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్ళారు. ఈ సందర్భంగా బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు రమేష్, మాజీ ఎంపిటిసి రాంరెడ్డిలు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి మూడోసారి అధికారంలోకి రావడంతో పాటు నరేంద్రమోడి మళ్ళీ ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు. మోడి ఆధ్వర్యంలోనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఎంపి ఎన్నికల్లో ప్రజలందరూ కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించి మోడిని ప్రధానమంత్రిని చేయాలని పేర్కొన్నారు. తరలివెళ్ళిన వారిలో ఎంపిటిసి చైతన్య శంకర్‌రెడ్డి, బిజెపి మండల ఉపాధ్యక్షుడు రాజేందర్‌సింగ్, బిజెపి నాయకులు కుంట సత్యం, సత్యనారాయణ, కుమార్, లింగ భాస్కర్, అంజిరెడ్డి, శ్రీను, రవి, మహేష్, సంతోష్‌కుమార్, రాజు, బాలకృష్ణ, కృష్ణమూర్తి, కరుణాకర్, సురేష్, నగేష్ తదితరులు ఉన్నారు.

### ఖాన్‌చెరువు కట్ట హనుమాన్ దేవాలయానికి రూ.25వేల విరాళం

**వర్గల్, మార్చి 5 (ప్రభాతవార్త):** వర్గల్ మండల పరిధిలోని అంబర్‌పేట ఖాన్ చెరువు కట్ట శ్రీ హనుమాన్ క్షేత్రానికి స్థానిక కాంగ్రెస్ నేత అనిల్‌రెడ్డి రూ.25వేల విరాళం అందజేశారు. మంగళవారం ఆలయ మండప ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అనిల్‌రెడ్డి మాట్లాడుతూ తనకు హనుమంతుడు అత్యంత ప్రీతిపాత్రమని, ఆ స్వామి కృపతో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, రైతులు పాడిపంటలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. లోక కళ్యాణార్థం నిర్వహిస్తున్న ఈ ఉత్సవంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొడపర్తి కృష్ణ, రాజిరెడ్డి, కుమార్‌యాదవ్, శ్రావణ్‌రెడ్డి, వెంకటేష్, సతీష్, సల్మాన్, నందకుమార్, కృష్ణ, శ్రీకాంత్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ విద్యాధరిలో వైభవంగా మూలా నక్షత్ర విశేష పూజలు



లక్ష పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

**వర్గల్, మార్చి 5 (ప్రభాతవార్త):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో మంగళవారం మూలా నక్షత్ర విశేష పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో మూలా మహోత్సవానికి అంకురార్పణ చేయగా వేద పండితులు అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, లక్ష పుష్పార్చన, చండీ హోమం, ప్రత్యేక పూజలు, అలంకరణ తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మూల నక్షత్ర మహోత్సవాన్ని పురస్కరించుకొని క్షేత్రానికి తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో శంభుగిరి కొండలు అమ్మవారి నామస్మరణతో మారుమ్రోగగా ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.

## ఉపాధి కూలీల సమస్యలు పరిష్కారించాలి

**యాచారం మార్చి5,ప్రభాతవార్త :** ఉపాధి హామీ పథంలో పని చేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఆర్డిఓ పిడి ఆశలతను వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు అంజయ్య కందుకూరి జగన్ ,జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ జంగయ్య ,నాయకులు బుగ్గ రాములు,చరణ్ ,శ్రీకాంత్ కలిసి వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ…పేస్లిప్పులు ఇయ్యాలని పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని అన్నారు.మెడికల్ కిట్టు అందుబాటులో ఉండాలని పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు నీళ్లు,నీడ కల్పించాలని ఉదయం పూట పోటో తీయడం వలన ఉదయం 1-30 గంట నిమిషాలు లేటు అయ్యి ఎండలో పని చేస్తున్నారు.కాబట్టి ఫోటో తీసే విధానం రద్దు చేయాలని ,కొలతలు లేకుండా రోజు కూలీ 800 రూపాయలు ఇయ్యాలని తదితర సమస్యలు వివరించినట్లు తెలిపారు.

### గాలికుంటు నివారణ కోసం పశువులకు టీకాలు వేయించాలి

**కడ్తాల్,మార్చి 05 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వివిధ గ్రామాలలో డా. భానునాయక్ ఆధ్వర్యంలో ముమ్మరంగా కొనసాగుతున్న గాలికుంట టీకాల కార్యక్రమం మంగళవారం కడ్తాల్ మండలంలో పశువైద్య సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి కడ్తాల్, రావిచేడు, ముద్విన్, చెల్లంపల్లి, కర్కల్‌పహాడ్ గ్రామాలలో గాలికుంట టీకాలు వేశారు. గాలికుంట టీకాలు వేసిన మొత్తం పశువులలో ఆవులు 648, గేదెలు 22 మొత్తం పశువులు 670 వాటికి టీకాలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా డా. భానునాయక్ రైతు సోదరులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతు సోదరులు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా తమ పశువులకు వేయించుకోవాలని సూచించారు. ఈ గాలికుంట వ్యాధి నివారణ టీకాలు ఈనెల 30వ తేదీ వరకు వివిధ గ్రామాలలో కొనసాగుతుందని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది జెవిఓలు రాజేష్, మల్లేష్, వెంకటయ్య విఎ రమేష్, అఫ్సర్, బురాన్, చంద్రశేఖర్, సంజీవ, వాల్యానాయక్, గోపాలమిత్రులు, శ్రీశైలం, నవీన్ వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

### శివపార్వతుల కళ్యాణం ప్రచార కరపత్రం ఆవిష్కరణ

**ఆమనగల్లు, మార్చి05, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణంలోని పురాతన శివాలయంలో శివరాత్రిరోజు సాయంత్రం 7:30ని.లకు శివపార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. శివరాత్రి ఉత్సవాలకు శివాలయం సర్వాంగా సుందరంగా సిద్ధమవుతుంది. భక్తుల రాకను పురస్కరించుకుని ఉత్సవ కమిటీ పలు సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా శివపార్వతుల కళ్యాణం పురస్కరించుకుని మంగళవారం ఆలయం ప్రాంగణంలో ప్రచార కరపత్రాలను వేడుకగా ఆవిష్కరించారు. అంతకు ముందు ఆలయ పూజారి చెరుకు అక్షయ్‌కుమార్ వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ మూలవిరాట్ శివలింగం సన్నిధిలో కరపత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివపార్వతుల కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలిరావాలని ఉత్సవ కమిటీ కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కోట్ల వెంకటేశ్, చెక్కాల లక్ష్మణ్, గాజల తిరుపతయ్య, కండె భాస్కర్, గాజుల రమేశ్, ఎ ఉన్నారు.

### ఉద్యోగులకు పలు సౌకర్యాలు అందించడమే లక్ష్యం

**శామిర్‌పేట మార్చి5,ప్రభాతవార్త :** ప్రముఖ బ్యాంకు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ కార్పొరేట్ వేతన రిలేషన్‌షిప్ కోసం స్టీల్ అథారిటి ఆఫ్ ఇండియా లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఈ ఒప్పందంతో సెయిల్ ఉద్యోగులు తమ ఖాతాతో పాటు పలు సౌకర్యాల ప్రయోనాలను అందుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు..

# సీలింగ్ భూములలో నిర్మాణాలను కూల్చి వేసిన రెవెన్యూ అధికారులు

## -జీవో 118 కింద క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని బాధితుల ఆందోళన



**బోడుప్పల్, మార్చి 6 ప్రభాతవార్త:** ఇరవై ఐదు సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన ప్లాట్లు ఇప్పుడు సీలింగ్ భూములంటూ తమపై రెవెన్యూ అధికారులు ప్రతాపం చూపడం సరికాదని మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పర్వతాపూర్‌లోని సాయి ప్రియ వాసులు వాపోతున్నారు. మంగళవారం తెల్లవారు జామునే మేడిపల్లి రెవెన్యూ అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య సాయిప్రియనగర్ కాలనీలోని నిర్మాణాలను జేసీబీల సహాయంతో నేలమట్టం చేశారు. కూల్చివేతల విషయం తెలుసుకున్న ప్లాట్ల యజమానులు అక్కడికి చేరుకోని కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మీడియాతో మాట్లాడుతూ పర్వతాపూర్ రెవెన్యూ సర్వే నెం 1,10,11లో సాలార్జంగ్ కంచె పేరుతో ప్రభుత్వ మిగులు భూములున్నాయని అయితే కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆ విషయాన్ని దాచి పెట్టి పక్క సర్వే నెంబర్లను ఉపయోగించి ఈ భూములను ప్లాట్లు చేసి రిజిస్ట్రేషన్ చేసి మమ్మల్ని మోసం చేశారని వాపోయారు.

**జీవో 118 పని చెయ్యలేదా…?**

సీలింగ్ భూములలో తెలిసో తెలియకో ఇంటి నిర్మాణాలను చేసుకున్న వారికి ఉపశమనం కలిగిస్తూ గత ప్రభుత్వం సీలింగ్ భూములలో ఇండ్ల నిర్మాణం చేసుకున్న వారికి క్రమబద్ధీకరణ చేసేందుకు గజానికి రూ.250 చొప్పున ఫీజు నిర్ధారించి జీవో నెంబరు 118 ని విడుదల చేసింది అయితే ఇక్కడ కూడా అ జీవో ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోవచ్చు అని అశపడిన పేదలకు నిరాశే ఎదురైంది ఎందుకంటే సర్కారు విడుదల చేసిన జీవో లో జీవో విడుదల కంటే ముందే నిర్మాణం ఉంటేనే క్రమబద్ధీకరణకు అర్హులు అంటూ పేర్కొనడం జరిగింది. దీంతో చాలా మంది అనర్హులుగా మిగిలిపోయారు.

**ఎలాగైనా క్రమబద్ధీకరణ చేస్తామని వసూళ్లు!**

అధికారం తమ చేతుల్లో ఉండడంతో గత ప్రభుత్వంలోని పెద్దలు కొందరు సర్కారు జీవో నెంబరు 118 కి విరుద్ధంగా ఉన్న సరే మీ ప్లాట్లు అన్ని కూడా క్రమబద్ధీకరణ చేస్తామని మోసపూరిత మాటలు చెప్పి ఒక్కో ప్లాట్ కు ఇంత ఎక్కువ ఖర్చు అవుతుందని చెప్పి సాయిప్రియానగర్ కాలనీవాసులనుండి పెద్ద ఎత్తున వసూళ్లు చేసినట్లు బాధితులు వాపోయారు. అనంతరం రాత్రి రాత్రే చిన్న చిన్న రూంలు వేసి వాటికి కరెంటు మీటర్లు తెచ్చి, మున్సిపల్‌లో తమ పరపతితో ఇంటి నెంబర్లను తెచ్చేందుకు ప్రయత్నాలు చేసి కొన్ని తెచ్చారు. కానీ అధికారులు కొందరు తమ మాటలు వినక పోవడంతో ఇంటి నెంబర్ల స్కీం వర్కౌట్ కాలేదని అంటున్నారు. డబ్బులు తీసుకుంటే తీసుకున్నారు కానీ మాకు న్యాయం చెయ్యలేదు ఇప్పుడు మేము ఎవరిని అడగాలి అంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు.తమ నుండి డబ్బులు వసూళ్లు చేసిన ఏ ఒక్కరిని వదిలే ప్రసక్తే లేదని అన్నారు. ఇందులో భూ కబ్జాలకు పాల్పడిన వ్యక్తులవి మాత్రం అలాగే ఉంటారని ఏ దిక్కు లేని పేదల ఇండ్లను మాత్రమే అధికారులు కూల్చివేశారని కబ్జాదారులతో అధికారులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు.తమ ప్లాట్లు న్యాయంగా తమకు దక్కే వరకు మా పోరాటం అపేది లేదని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళి తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతామని బాధితులు వాపోయారు.

**భారీ బందోబస్తు….**

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని సాయిప్రీయా నగర్ కాలనీలోని సీలింగ్ భూములలో ఉన్న నిర్మాణాలను కూల్చివేసేందుకు గాను మేడిపల్లి రెవెన్యూ అధికారులు భారీ సంఖ్యలో పోలీసు బందొబస్తు కోరడంతో మేడిపల్లి పోలీసులతో పాటు,మల్కాజిగిరి జోన్ పరిధిలోని వివిధ పోలీసు స్టేషన్ల సిబ్బంది బందొబస్తుకు వచ్చారు. మేడిపల్లి తహసీల్దారు ఎంఎస్ హసీనా, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు,పలు పోలీసు స్టేషన్లకు చెందిన సీఐలు,ఎస్సైలు పాల్గొన్నారు.

# యువతకు క్రీడలు ఎంతో అవసరం

## -ఎస్ఎస్ ఆటోమెబైల్ సీఈవో శ్రీమాన్



ఇన్విక్టా2024 ప్రారంభించిన ఎస్ఎస్ ఆటోమొబైల్ సీఈవో శ్రీమాన్

**మొయినాబాద్, మార్చి 05, ప్రభాతవార్త :** నేటి విద్యార్థులకు, యువతకు క్రీడాలు ఎంతో అవసరమని ఎస్ఎస్ ఆటో మొబైల్ సీఈవో శ్రీమాన్, అన్నారు, మొయినాబాద్ మండలంలోని చిల్కూర్ రెవెన్యూలో గల కె.జి రెడ్డి ఇంజనీరింగ్ కళశాలలలో విద్యార్థులు ఇన్విక్టా 2024తో రాష్ట్ర స్థాయి సాంస్కృతిక ఇండోర్, అవుట్‌డోర్ క్రీడాలను ప్రారంభించారు, ఈ కార్యాక్రమానికి ముఖ్య అతిధిలుగా ఎస్ఎస్.ఆటోమొబైల్ సీఈవో శ్రీమాన్ చేతులమీదుగా ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాంలో ఉన్నటువంటి ప్రస్తుల పరిస్థితుల్లో, విద్యార్థులకు, యువతకు క్రీడలు ఎంతో అవసరమని, వారికి ఎంతగానో ఉపయోగపడుతాయాన్నారు, రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను శ్రీకారంచుట్టి, విద్యార్థుల్లో ఉన్నటువంటి ట్యాలెంట్‌ను భయటికి తీసుకువస్తున్న కె.జి.రెడ్డి కళశాల యాజమన్యానికి ప్రత్యేకంగా దన్యవాదాలు తెలిపారు, ఈ ఇన్విక్టా 2024 మూడు రోజులు, నిర్వహిస్తున్నారు, అవుట్‌డోర్ బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబ్బడ్డీ, త్రోబాల్, ఇండోర్ గేమ్స్ చెస్, క్యారమ్స్, టెబుల్‌టెన్నీస్, ఫోటోగ్రఫీ, చాయాచిత్రం, డ్యాన్స్, మ్యూసిక్, సాంస్కృతిక పోటీల్లో దాదాపు యాభైకళాశాలల నుండి పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గోని వారి యోక్క ప్రదర్శనను కనబరిచారు, మొయినాబాద్ మండల ఎస్ఐ కిషన్‌జి, పోటి ప్రారంబోత్సవానికి అతిదిగా హాజరయ్యారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిదశలోనే విద్యార్ధులు ఉన్నత రంగాన్ని ఎంచుకోని ఆ దిశగా లక్ష్యాన్ని ఏర్పాటుచేసుకోని అనుకున్నది సాధించాలన్నారు, ఈ కార్యాక్రమాన్ని ఆర్గనైజర్లు కె.జి రెడ్డి కళశాల సినియర్ విద్యార్థులు నిర్వహించారు, ఈ కార్యాక్రమంలో కళశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ నర్సయ్య, ఫిజికల్ డైరెక్టర్లు కావేరి, సంకేత్, స్పోర్ట్స్ కన్వీనర్లు, వనయ్‌సాయి, సాయి చరణ్, కల్చరల్ కన్వినర్లు, శాంతి సిద్దినేని, పడిషాల ఆకాష్, హెచ్‌వోడిలు, అధ్యాపకులు తధితరులు పాల్గోన్నారు.

# మారుతీనగర్ ముఖధ్వారంకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**ఘట్‌కేసర్, మార్చి 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ శివారెడ్డిగూడలో మంగళవారం మారుతీనగర్‌కాలనీ ముఖద్వారం నిర్మాణ పనులకు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో మారుతీనగర్ కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఇటీవలే ఎన్నిక కాగా ప్రధాన రహదారి వద్ద ప్రవేశద్వారం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈమేరకు స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి ద్వారా ప్రజాప్రతినిధులు, కాలనీనాయకులు కొబ్బరికాయలు కొట్టి పనులకు భూమి పూజల చేయగా శాలువాతో మల్లారెడ్డిని సన్మానించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడి , కొమ్మగోని రమాదేవి, బండారి అంజనేయులు, కొమ్మిడి అనురాధ, కోఆప్షన్ సభ్యురాలు పల్లె అరుణ, సొసైటీ డైరక్టర్లు రేసు లక్ష్మారెడ్డి, చందుపట్ల ధర్మారెడ్డి,మాజీ సర్పంచ్ ఒరుగంటి వెంకటేష్ గౌడ్,కీసరగుట్ట డైరక్టర్ ఎంపాల సుధాకర్‌రెడ్డి,కాలనీ అధ్యక్షులు దయాకర్,లంబ శ్రీనివాస్,బిక్షపతి,రామకృష్ణ,అశోక్, రాజ్‌కుమార్, సంజీవ, ప్రవీణ్ కు మార్,రాజు, శ్రీరాములు,రమేశ్‌గౌడ్,కృష్ణమూర్తి, సాయిరెడ్డి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎన్ఎఫ్‌సీనగర్‌లోని ప్రేమహస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని కుట్టు, భ్యూటిషియన్ కోర్సులో శిక్షణ పొందిన మహిళలకు ధృవపత్రాలను అందజేసి నట్లు తెలిపారు.

# సమాజాభివృద్ధికి తోడ్పడే నూతన ఆవిష్కరణలు రావాలి

## - కాకతీయ యూనివర్శిటి ఇంజనీరింగ్ కళాశాల ఫ్రోఫెసర్ ఎన్.రమణ



ఎస్ఎఫ్ఐ కాన్వెన్షన్‌లో మాట్లాడుతున్న కాకతీయ యూనివర్శిటి ఇంజనీరింగ్ కళాశాల ఫ్రోఫెసర్ ఎన్.రమణ

**ఇబ్రహీంపట్నం, మార్చి 5, ప్రభాతవార్త:** సమాజాభివృద్దిలో సాకేతికత, ఏఐ ఇంటలిజెన్స్ తోడ్పాటుతో నూతన ఆవిష్కరణలు రావాలని కాకతీయ యూనివర్శిటి ఇంజనీరింగ్ కళాశాల ఫ్రోఫెసర్ ఎన్.రమణా అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యార్థుల కాన్వెన్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శంకర్ స్వాతంత్ర్య, ప్రజాస్వామ్య, సోషలిజం లక్ష్యాలు గల జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకతీయ యూనివర్శిటి ఇంజనీరింగ్ కళాశాల ఫ్రోఫిసర్ ఎన్.రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని దశాబ్దాలుగా ఆధునిక ప్రపంచంలో నూతన ఆవిష్కరణలతో టెక్నాలెజి పోషించిన పాత్ర విశేషమైయిందన్నారు. పెట్టుబడి దారులు ఏఐ సాంకేతికతో లాభాలుగడిస్తున్నారన్నారు. టెక్నాలెజీతో ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో అంతకంటే ఎక్కువ దుష్పరిణామాలు ఉన్నాయని అన్నారు. టెక్నాలెజిని మంచికి ఉపయోగించాలి కాని చెడుకు ఉపయోగించకుండా కట్టడి చేయాల్సిన భాద్యత మనందరిపై ఉందన్నారు.సాంకేతికత విద్యార్థులకు సకాలంలో స్కాలర్ షిప్, ఫీజ్ రియంబర్స్‌మెంట్ ఇవ్వాలని అదేవిదంగా అనుభవజ్ఞులైన అధ్యాపకులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజుల దోపిడిని ఆరికట్టాలని ప్రతి జిల్లాకు ఒక ఇంజనీరింగ్ కళాశాల,ప్రతి నియోజకవర్గాని ఒక పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలనే అంశాలపై తీర్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేంద్రకమిటీ సభ్యురాలు మమత, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కిరణ్, వీరభద్రం, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రణయ్, భరత్, వినయ్, లక్ష్మణ్ తదితరులున్నారు.

### ఆర్ఓబీ బాధితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి



ప్రజాభవన్‌లో వినతిపత్రం అందజేసిన ఆర్ఓబీ నిర్వాసితులు

**ఘట్‌కేసర్, మార్చి 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వేవంతెనలో ఇండ్లు, దుకాణాలు, స్థలాలు కోల్పోయిన నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని బాధితులు మంగళవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఘట్‌కేసర్‌లో రైల్వేగేటు వద్ద గత 15 సంవత్సరాలుగా నిర్మిస్తున్న రైల్వేవంతెనలో ఇండ్లు స్థలాలు కోల్పోయిన బాధితులకు సరైన నష్టపరిహారం ఇవ్వలేదని, కొండాపూర్ సర్వేనంబర్ 257లోని ప్రభుత్వభూమిలో 60 గజాల చొప్పున ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇప్పటి వరకు స్థలాలు చూపలేదని తెలిపారు. గత 45 ఏళ్లుగా రహదారి పక్కన దుకాణాలు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్న తమకు వంతెన వల్ల వ్యాపారాలు కోల్పోయి తీవ్ర అన్యాయం జరిగిందని 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం గజానికి రూ.40,000లు చెల్లించడంతో పాటు 60 గజాల ఇళ్ల స్థలాలు ఎక్కడైనా అప్పగించాలని వారు కోరారు. బాధితులు బర్ల రాధాకృష్ణ, ఎం.శంకర్, బి.మహేశ్, బర్ల పోచయ్య, అంజనేయులు తదితరులు ప్రజాభవన్‌లో వినతిపత్రం అందజేశారు.

### మయూర కంపెనీ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

**-అధ్యక్షుడిగా మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి**



కంపనీ కార్మికులతో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

**మేడ్చల్, మార్చి 5. ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటి పరిధిలోని మయూర కంపనీ కార్మిక యూనియన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడుగా మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్‌గా రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులుగా బాలమల్లేష్, నర్సింహ్ములు, జాయింట్ సెక్రటీలుగా మధుసూదన్‌రెడ్డి, మల్లేష్, ఆర్గనైజింగ్ సెక్రటీగా శ్రీను, కోశాధికారిగా ప్రసాద్ రాదు, సభ్యులుగా దిల్లేశ్వర్‌రావు, సతీష్ కుమార్, వీరాంజనేయులు, సురేష్, ఖాధర్, వాలి, రాము, వెంకట్రావు, ఫనీంద్ర, బాలకృష్ణలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కంపనీ మేనేజర్ వీరభద్రరావు, హెచ్‌ఆర్ జోసెఫ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### తిరుపతికి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని వినతి



ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి డిఆర్ఎం భర్తేశ్‌కుమార్‌జైన్‌కు వినతిపత్ర ం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావనియాదవ్

**ఘట్‌కేసర్, మార్చి 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో తిరుపతి వెళ్లే రైళ్లను ఆపేవిధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ డిఆర్‌ఎంకు వినతిపత్రం అందజేశారు. ఘట్‌కేసర్‌లో ఎంఎంటీఎస్ రైలు ప్రారంభోత్సవంలో పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి ఆమె సికింద్రాబాద్ డిఆర్‌ఎం భర్తేశ్‌కుమార్‌జైన్‌కు రైళ్ల ఆపాలని వినతిపత్రం ఇచ్చారు. తిరుపతితో ఇతర దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు రైలు ఎక్కడానికి దిగడానికి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్లాల్సి వస్తుందని ఘట్‌కేసర్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఎంఎంటీఎస్ ద్వారా రైలు సేవలు సామాన్య, పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన దక్షణ మధ్య రైల్వే అధికారులు వయా సికింద్రాబాద్ స్టేషన్ మీదుగా నడుపుతే ప్రయాణికులకు మేలు జరుగుతుందన్నారు.ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఘట్‌కేసర్ ప్రజలకు ఎంఎంటీ ఎస్ సేవలను అందేలా కృషి చేసిన కేంద్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎంపిపి, అధికారులకు చైర్‌పర్సన్ పావనియాదవ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

### ప్రజాపాలన సేవా కేంద్రాన్ని వినియోగించుకోవాలి

**-మున్సిపల్, మండల కార్యాలయాల్లో ప్రారంభం**




ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ పావనియాదవ్, కమీషనర్ సాబేర్‌ఆలీ

**ఘట్‌కేసర్, మార్చి 5, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి, రూ.500లకు గ్యాస్ సిలిండర్ పథకాలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే సహాయక కేంద్రంలో పరిష్కారం చూపుతారని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ పురపాలక సంఘం, మండల పరిషత్ కార్యాలయాల్లో మంగళవారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఆమె కమీషనర్ ఎండి.సాబేర్‌ఆలీతో కలిసి ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజాపాలన కౌంటర్ తెరచి ఉంటుందని సమస్యలు తెలియజేయాలని వారు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రజాపాలన సహాయక కేంద్రాన్ని ప్రారంభించి ధరఖాస్తులను స్వీకరిస్తున్నారు. గృహజ్యోతి, గ్యాస్ సబ్సీడీ అందని లబ్దిదారులు తమ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, విద్యుత్, గ్యాస్ బిల్లు, ప్రజాపాలన ధరఖాస్తు రశీదులు తీసుకువచ్చి నమోదు చేయించుకుంటే సెల్‌పోన్ నంబర్‌కు ఓటిపి వస్తుందని అప్‌డేట్ చేస్తారని తెలిపారు. లబ్ధి పొందడంలో ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా కార్యాలయంలో సేవా కేంద్రంలో అడిగి నివృత్తి చేసుకొని ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

### రైతు పక్షపాతి చెన్నకిషన్‌రెడ్డి సేవలు ప్రశంసనీయం



అన్నదానం నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు

**కడ్తాల్,మార్చి 05 ప్రభాతవార్త :** మానవ సేవే మాధవసేవ అని డా.వి. దామోదర్‌రెడ్డి అన్నారు.సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్ రాంరెడ్డి కంటి ఆసుపత్రి ఛైర్మన్ డా. వి. దామోదర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. నిస్వార్థంతో చేసే సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఆయన పేర్కొన్నారు. మంగళవారం లయన్ జి. చెన్నకిషన్‌రెడ్డి 72వ జన్మదినం సందర్భంగా కడ్తాల్ పట్టణంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబలి కేంద్రం, అన్నదాన కార్యక్రమాన్ని దామోదర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్ చెన్నకిషన్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌ను వేదికగా చేసుకొని చెన్నకిషన్‌రెడ్డి చేపట్టిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. రైతు బిడ్డగా రైతు పక్షపాతిగా అందించిన చిన్న కిషన్‌రెడ్డి సేవలు ఇతరులకు ఆదర్శనీయమన్నారు. సామాజిక సేవలలో లయన్స్ క్లబ్ ఇతర స్వచ్ఛంద సంస్థలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతం నుండి అంతర్జాతీయ స్థాయిలో లయన్స్‌సేవలు పేదలకు వరంలా మారాయని ఆయన కొనియాడారు. చిన్న కిషన్‌రెడ్డి సమాజానికి మరిన్ని సేవలు అందించేలా భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, మహేంద్రకుమార్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అంజయ్య, గంప శ్రీను, గూడూరు లక్ష్మినరసింహారెడ్డి, గంప వెంకటేష్, దోనాదుల మహేష్, రాజేందర్, లక్ష్మయ్య,ఓంకారం యాదయ్య,జూలు రమేష్,కొండల్‌రెడ్డి,గంప వెంకటేష్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి,అద్దాల రాములు, పిఆర్‌ఓ పాషా ఉన్నారు.

## ఇంటింటికి పోలియో చుక్కలు



పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారి

**కొడంగల్,మార్చి 5ప్రభాతవార్త :** పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్ళి చిన్నారులకు పోలియో చుక్కలు తప్పకుండా వేయాలని డబ్ల్యూహె చ్ఓ పరిశీలకులు బద్రీనాథ్ వైద్య సిబ్బందికి సూచించారు.కొడంగల్ మండలం లోని అంగడిరైచూర్ గ్రామంలో ఇంటింటికి పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు.పోలియో చుక్కలు వేయడం ద్వారా చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ మహేందర్‌రాజ్,హెల్త్ వర్కర్ మధుసుదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న డిబిఎఫ్ నాయకుడు ఎగొండ స్వామి

## కూలీలకు వెంటనే డబ్బులు చెల్లించాలి

**డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగొండ స్వామి**

**కొండపాక, మార్చి 5, ప్రభాతవార్త :** ఉపాది హామి కూలీలకు చేసిన పనికి డబ్బులు రాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగొండ స్వామి అన్నారు. మంగళవారం తిప్పారం, ముద్దాపూర్ గ్రామాల్లో ఆయన ఉపాది పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. గత నాలుగు నెలలుగా ముద్దాపూర్‌లో నర్సరీ, చెట్ల తొలగింపు పనులు చేసిన డబ్బులు ఇప్పటి వరకు రాలేదన్నారు. తిప్పారంలో రాయబంజరు కట్ట దగ్గర చెట్లు తొలగింపు పనులు చేసిన వారికి సంవత్సర కాలంగా కూలీ డబ్బులు రాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం ఎండలు ముదిరిన కాని పని చేసే ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంట్లు, పనిముట్లు కూడా లేవన్నారు. పనులు చేసిన 15 రోజుల్లో చేసిన పనులకు కూలీ డబ్బులు రావాల్సి ఉండగా నెలలు గడుస్తున్న రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని పని చేసే ప్రదేశంలో సౌకర్యాలు కల్పించి, కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలని కోరారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ధ్యేయం


బోరు డ్రిల్లింగ్‌ను ప్రారంభిస్తున్న వాసరి లింగరావు

**కొండపాక, మార్చి 5, ప్రభాతవార్త :** ప్రజాపాలనలో ప్రజా సమస్యల పరిష్కరమే ద్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నరని మండల కొండ పాక మండల పార్టీ అధ్యక్షుడు వాసరి లింగరావు అన్నారు. మంగళవారం కొండపాక మండలంలోని దమ్మక్కపల్లి మదిర పిట్టల వాడలో నీటి కొరత ఉందని గ్రామస్తులు ప్రజా పాలనలో తెలిపారన్నారు. దానికి స్పందించిన ప్రభుత్వం వెంటనే తాగు నీటి సమస్యను పరిష్కరించడానికి బోరు వేయించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా లింగరావు కొబ్బరికయ కొట్టి బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కరమే ద్వేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా దయానంద సరస్వతి జయంతి వేడుకలు


మాట్లాడుతున్న నిర్వాహకులు

**సిద్దిపేట అర్బన్, మార్చి 5, ప్రభాతవార్త :** సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆర్య సమాజ స్థాపకులు స్వామిదయానంద సరస్వతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్షశోద సంస్థానం నిర్వహకులు అచార్య నీరజ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి మానవ విలువలు చక్కగా తనదైనశైలిలో విద్యార్థులకు వివరించారు. ప్రాచ్యాత సంస్కృతికి అలవాటు పడకుండా చెడుకు దూరంగా ఉండాలని మంచిని అలవాటు చేసుకొని దేశ సంస్కతిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో యాదవరెడ్డి, ఉపాధ్యాయులు ఇంద్రసేనారెడ్డి, నరసింహరెడ్డి,బాలరంగం, శ్రీనివాసు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు భూమిని కేటాయించాలి


తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరహార దీక్ష దృశ్యం

**బెజ్జంకి, మార్చి 5, ప్రభాతవార్త :** అర్హులైన పేదలకు భూమిని కేటాయించాలని బిజెపి మండల అధ్యక్షులు కొలిపాక రాజు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గూడెం గ్రామానికి చెందిన దళితులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట భూమి కోసం చేపట్టిన నిరహార దీక్ష ఆరో రోజుకు చేరడంతో వారికి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. 2017లో అప్పటి సిఎం కెసిఆర్ దళితులకు 3 ఎకరాల భూమిని పంపిణీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు గూడెం గ్రామంలో 60 ఎకరాల ప్రభుత్వభూమిని గుర్తించి ఎలాంటి గ్రామ సభ నిర్వహించకుండా స్థానిక నాయకులు వారి అనుచరులైన వారి పేర్లను సిఫార్సు చేసి అసలైన దళితులను మోసం చేశారని తెలిపారు. ఇద్దరు దళిత యువకులు కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడగా మాంకాలి శ్రీనివాస్ అనే యువకుడు మృతి చెందిన ఇప్పటికి గూడెం గ్రామంలో అప్పటి ప్రభుత్వం దళితులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయారని కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా గూడెం నిరుపేద దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం జరిగే వరకు పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చాడా వెంకటరెట్టి, కొత్తకోట రామచంద్రం,సంఘ ం రవి, వడ్లూరి శ్రీనివాస్, గాజ రవి పాల్గొన్నారు.

## పుల్‌నాయక్‌తండా విద్యార్థుల క్షేత్ర పర్యటన

**హుస్నాబాద్, మార్చి 5, ప్రభాతవార్త :** మండలంలోని పుల్‌నాయక్ తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులను మంగళవారం ప్రధా నోపాధ్యాయులు శివప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణానికి క్షేత్రస్థాయి పర్యటనకు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ఎల్లమ్మ చెరువు,అయ్యప్ప స్వామి దేవాలయం,పోలీస్ స్టేషన్,స్విమ్మింగ్ ఫుల్,గార్డెన్‌లను చూపించారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన సందర్బంలో ఎస్ఐ తోట మహేష్ సిబ్బంది విద్యార్థులకు ట్రాఫిక్ నిబందనలు,సైబర్ క్రైం,చట్టాలు,100 లాంటి వాటిపై అవగాహన కల్పించారు.ప్రస్తుతం అదికంగా జరుగుతున్న నేరాలు ఆ నేరాలకు పడే శిక్షలు,జూదం,డ్రక్స్ లాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు.

## మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

**గజ్వేల్, మార్చి 5 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా గోల్కొండ నర్సయ్య ఇటీవల బాధ్యతలు స్వీకరించగా మున్సిపల్ పరిధిలోని 3వ వార్డుకు చెందిన లక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ మర్కంటి కనకయ్య, బిఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు ఎల్లేశం, సీనియర్ నాయకులు కుర్రె మహేందర్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందని, 3వ వార్డులో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు.


మున్సిపల్ కమిషనర్ నర్సయ్యను సన్మానిస్తున్న కనకయ్య

# రామాయంపేటను అభివృద్ధి చేసుకుందాం

### మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

**రామాయంపేట మున్సిపాలిటీ, మార్చి 5, ప్రభాతవార్త :** పార్టీలకతీతంగా రామాయంపేట మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని, అందుకు తనవంతుగా పూర్తిగా సహకరిస్తానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మంగళవారం నాడు మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలప్పుడే పార్టీలు ఉంటాయని, తర్వాత అందరం ఒక్కటిగా ఉండి అభివృద్ధిని చేసుకోవాలన్నారు. ఎంతో నమ్మకంతో గెలిపించిన ప్రజలకు ప్రజాప్రతినిధులుగా న్యాయం చేయాలని అన్నారు. పట్టణంలోని మల్లెచెరువు కట్ట మినీ ట్యాంక్‌బండ్ అతి త్వరలోనే పూర్తిచేయాలని, అందుకు సంబంధించిన ఏర్పాట్లను చేసి తనకు వివరిస్తే సహకరిస్తానన్నారు. అంతేకాకుండా పట్టణంలో ఎవరైనా మరణిస్తే అంతిమయాత్రకు ఉపయోగించే వైకుంఠరథంను మున్సిపాలిటీనుండి ఏర్పాటు చేయాలని, లేదంటే తాను స్వయంగా తన స్వంత ఖర్చులతో ఏర్పాటు చేస్తానన్నారు. ముఖ్యంగా పట్టణంలో ఇంటిపన్నుల విషయంలో గందరగోళం నెలకొన్నట్లు తన దృష్టికి వచ్చిందని, అధికారులు అట్టి విషయంలో రివిజన్ చేసి చర్యలు తీసుకోవాలని, న్యాయంగా ఇంటిపన్నులను


మాట్లాడుతున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

వసూలు చేయాలని అక్కడే ఉన్న మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. సమావేశంలో ఆవేశంలో కొందరు కౌన్సిలర్‌లు మాట్లాడిన వ్యక్తిగత విషయాలను, పలు పదాలను రికార్డులనుండి తొలగించాలని కమీషనర్‌కు తెలిపారు. గత పది సంవత్సరాలుగా ఉన్న ఎమ్మెల్యే ఇక్కడ చేసిన అభివృద్ధి శూన్యమని, మున్సిపల్ కార్యవర్గం ఏర్పడిననాటి నుండి ఏఒక్క బడ్జెట్ సమావేశానికి కూడా ఎమ్మెల్యే రాకపోవడం చాలా విడ్డూరం అన్నారు. రామాయంపేట రెవెన్యూ డివిజన్ కోసం పోరాడుతున్న సమయంలో తాను దీక్ష శిభిరం వద్దకు వచ్చి మద్దతు తెలిపిన మర్నాడే ఎన్నికల స్టంట్‌గా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారే గాని, ఇప్పటివరకు అందుకు సంబంధించిన ఎలాంటి పనులు జరగలేదన్నారు. ఇటీవల నలుగురు కౌన్సిలర్‌లు బీఆర్ఎస్ పార్టీనుండి కాంగ్రెస్ పార్టీలోకి మారడంతో, కొందరు డబ్బులిచ్చి కౌన్సిలర్‌లను తీసుకున్నట్లు విషప్రచారం చేస్తున్నారని, కానీ ఎవరికీ కూడా డబ్బులిచ్చి పార్టీలోకి తీసుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. అభివృద్ధిని కోరేవారెవరైనా తమ పార్టీలోకి రావచ్చని, చైర్మెన్‌తో సహా అందరు కౌన్సిలర్‌లకు తమ పార్టీ సాధారంగా ఆహ్వానిస్తుందని సమావేశంలో పేర్కొన్నారు. అంతకు ముందు స్థానిక కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా తమ వార్డులలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ దేవేందర్, మేనేజర్ శ్రీనివాస్, ఏఈ సాయిరాం, అన్ని శాఖల మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయిని యాదగిరి

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

**-పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి**

**గజ్వేల్, మార్చి 5 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీలలో భాగంగా గృహజ్యోతి ఉచిత 200 యూనిట్ల పథకాన్ని అమలు చేయడం హర్షించదగ్గ విషయమని కాంగ్రెస్ పార్టీ పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు సంగుపల్లిలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ ఆధ్వర్యంలో విద్యుత్ జీరో బిల్‌ను విద్యుత్ అధికారులతో కలిసి వినియోగదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని, గత ప్రభుత్వం చేయని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేసిచూపిస్తుందన్నారు. ప్రజలు ఆరు గ్యారంటీలను నమ్మి కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టిందని, అందులో భాగంగానే నాలుగు గ్యారంటీలను అమలు చేయడం జరిగిందని, మరో రెండు గ్యారంటీలను త్వరలో అమలుచేయనున్నట్లు పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.అనంతరం వార్డులో పర్యటించి జీరో బిల్లులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, సయ్యద్ మతీన్, డాక్టర్ వాహిద్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నె కృపానందం, మహంకాళి చంద్రయ్య, యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్, ఎన్ఎస్‌యుఐ అసెంబ్లీ ప్రెసిడెంట్ కరుణాకర్‌రెడ్డి, ఆంథోనిరెడ్డి, గుండు లక్ష్మణ్, ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షుడు శివులు, క్యాసారం మల్లారెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి అజ్గర్, మైనార్టీ నాయకులు సయ్యద్ బాబా, నర్సింలు, రవి, సత్యనారాయణ, లింగం, ముత్యాలు పాల్గొన్నారు.

## నగదు బహుమతులు గెలుచుకున్న ప్రయాణీకులు

**సిద్దిపేట రూరల్, మార్చి 5, ప్రభాతవార్త :** దసరా పండుగ సందర్భంగా ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం చేసినందుకు గానూ లక్కి డ్రా ద్వారా సిద్దిపేట, దుబ్బాక డిపో పరిధిలో 4 ప్రయాణీకులు నగదు బహుమతులు గెలుచుకున్నట్లు సిద్దిపేట డిపో మేనేజర్ వై.సుఖేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. పి.శ్వేత సిద్దిపేట, సి.హెచ్.మల్లేశ్వరచారి సిద్దిపేట, బి.సురేందర్ తిరుమలాపూర్, కిషన్ దుబా ్బకలు నగదు బహుమతులను గెలుచుకున్నట్లు వివరించారు. విజేతలు అధార్ కార్డు, పాస్ ఫోర్ట్ ఫొటో, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలను సిద్దిపేట డిపోలో అందించాలన్నారు. ఆర్టీసి ఎం.డి. సజ్జనార్ చేతుల మీదుగా బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. ప్రయాణీకులు ఆర్టీసి బస్సులోనే ప్రయాణం చేసి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. సుఖ:వంతమైన, విలాసవంతమైన ప్రయాణం చేసి భవిష్యత్‌లో ఇలాంటి బహుమతులు గెలుచుకోవాలన్నారు. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దన్నారు. ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**తొగుట, మార్చి 5, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో తొగుటకు చెందిన చింత కుమార్ ఇటీవల అప్పుల బాధతో పురుగుల మందు తాగి మృతి చెందగా బాధిత కుటుంబానికి నీలం మధు ముదిరాజ్ యువసేన అధ్వర్యంలో మంగళవారం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. కుటుంబానికి అండగా నిలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎంఆర్ యువసేన మండల అధ్యక్షులు కొంత భాస్కర్, చింత అజయ్, పిట్టల యాదగిరి, రాజు, నవీన్ పాల్గొన్నారు.

## అంధుల జీవనభృతికి విద్యార్థులకు విరాళం అందజేత

**సిద్దిపేట రూరల్, మార్చి 5, ప్రభాతవార్త :** అంధుల జీవనభృతికి విద్యార్థులు చేసిన సహాయం వారి మంచి మనసుకు నిదర్శనమని సహస్ర పాఠశాల చైర్మన్ దరిపల్లి చంద్రం అన్నారు. మంగళవారం సిద్దిపేటలో సోచ్ ఫౌండేషన్‌కు సహస్ర విద్యాలయం విద్యార్థులు రూ.29 వేల 500 విరాళంగా అందించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్థించే పెదవులు కన్నా సహాయం చేసే చేతేలే మిన్న అన్నారు. విద్యార్థులు చిన్న తనం నుంచే సేవ దృక్పతం అలవర్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాడెంట్ శ్రావణ్, ప్రిన్సిపల్ శాంతికిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, మార్చి 5 (ప్రభాతవార్త):**

మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన పెద్దబోయిన సుగుణమ్మ అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న సిద్దిపేట జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు, బిఆర్ఎస్ మండల బిసిసెల్ అధ్యక్షుడు మ్యాల కనకయ్య ముదిరాజ్ మృతురాలి కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట జుట్టు సుధాకర్, చెక్కల నర్సింలు, కొట్టాల మహేష్ తదితరులు ఉన్నారు.

## ప్రభాకర్ కుటుంబానికి రూ.66వేల ఆర్థిక సహాయం

**గజ్వేల్, మార్చి 5 (ప్రభాతవార్త):**

మర్కుక్ విద్యుత్ శాఖ ఆపరేటర్ నక్క ప్రభాకర్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ సిఐటియు గజ్వేల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అతని భార్య కృష్ణవేణికి మంగళవారం గజ్వేల్ డీఈ భానుప్రకాష్ చేతులమీదుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ యూనియన్‌లోని అధికారులు, కార్మికులు అందరం కలిసి రూ.66వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ జగదీష్, ఏఈ సుధీర్, ఏఈ బాబయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, టిఎస్ఎస్‌పిడిసిఎల్ కంపెనీ అధ్యక్షుడు సింగిరెడ్డి చంద్రారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు దప్పు పర్శరాములు, ఉపాధ్యక్షుడు చంద్రం, డివిజన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఆర్.రవికుమార్‌గౌడ్, జిల్లా జాయింట్ సెక్రటరీ యాదగిరి, నాయకులు శ్రావణ్, చంద్రారెడ్డి, గోవర్ధన్, మురళి, ప్రవీణ్, మహేష్, నర్సింలు, శ్రీకాంత్, వెంకటేష్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

## గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడం సరికాదు

**సిద్దిపేట రూరల్(చిన్నకోడూరు), మార్చి 5 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మారుమూల ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించిందని చిన్నకోడూరు ఎంపిపి ఉపాధ్యక్షులు కీసరి పాపయ్య తెలిపారు. చిన్నకోడూరు మండలకేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చిన్నకోడూరు మండల కేంద్రం నుంచి కిష్టాపూర్ గ్రామం వరకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు కృషితో రూ.77 కోట్లతో నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్డు నిర్మాణానికి మంజూరైన రూ.77 కోట్ల నిధులను రద్దు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే మంజూరు వచ్చిన రూ.77 కోట్ల నిధులను రద్దు చేయకుండా తిరిగి మంజూరు చేయలన్నారు. మంజూరు వచ్చిన నిధులను రద్దు చేయడమేనా కాంగ్రెస్ వస్తే మార్పు అంటే ఇదేనని ప్రశ్నించారు. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే అట్టి నిధులను నల్గొండకు తరలించడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నాయకులు నముండ్ల రామచ ంద్రం, ఎల్లయ్య, మహేందర్, మొండయ్య, రామంచ రమేష్, శ్రీకాంత్, రాజు, కుమార స్వామి, పర్శరాములు, రామచంద్రం, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను అభినందించిన జిల్లా విద్యాశాఖ అధికారులు

**సిద్దిపేట అర్బన్, మార్చి 5, ప్రభాతవార్త** ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలను అమలుపరుస్తూ విద్యాభివృద్ధికి కృషి చేసిన అర్బన్ మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అధికారులు మంగళవారం అభినందించారు. ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి బెజుగామ వెంకటేశం అధ్వర్యంలో జిల్లా సెక్టోరియల్ అధికారి రామస్వామి, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, రాజ్ ప్రభాకర్‌రెడ్డిలు అయా పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం అయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విద్యావృద్ధికి చేసిన కృషి అభినందనీయమన్నారు. మండలంలోని నాంచార్‌పల్లి, వెల్కటూర్, బక్రిచెప్యాల, బూర్గుపల్లి, సిద్దిపేటలోని బీడీ వర్కర్స్ కాలనీల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులను అభినందించారు.

## రామకోటి రామరాజుకు ముత్యాల హారం బహూకరణ


రామరాజుకు ముత్యాలహారం అందజేస్తున్న భద్రాచలం ఏఈఓ శ్రావణ్‌కుమార్

**గజ్వేల్, మార్చి 5 (ప్రభాతవార్త):** రామ నామమే ప్రాణమని, రామ నామమే సర్వస్వం అని నమ్మి గత 25 సంవత్సరాల నుండి రామకోటి రాస్తూ లక్షల మంది భక్తులచే వ్రాయిస్తున్న ఆధ్యాత్మిక కృషికి గానూ, గత సంవత్సరం గోటి తలంబ్రాల కార్యక్రమంలో భాగంగా గ్రామ గ్రామాన తిరిగి వేలాది భక్తులను భాగస్వాములను చేసి వారిలో రామభక్తిని పెంచి గోటి తలంబ్రాలను భక్తితో వొలిపించి తిరిగి కల్యాణానికి అందించి రామభక్తిని చాటుకున్నందుకుగానూ భద్రాచలం దేవస్థాన ఏఈఓ శ్రావణ్‌కుమార్ రామకోటి రామరాజును సన్మానించి శ్రీసీతారాముల ముత్యాలహారాన్ని, స్వామివారి శేష వస్త్రాలను అందజేశారు. అంతకు ముందు సీతారాముల కల్యాణం అనంతరం భద్రాచలం దేవస్థానం వారు ముత్యాల తలంబ్రాలను రామకోటి భక్త సమాజానికి అందించారని, ఆ తలంబ్రాలను సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజు భక్తులకు అందించగా వారు తోచిన విధంగా కానుకలను హుండీలో వేయడం జరిగిందని తెలిపారు. హుండీలలో వచ్చిన రూ.22వేలను భద్రాచల దేవస్థాన హుండీలో వేయడం జరిగిందని పేర్కొన్నారు.

## మున్సిపల్ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలి

**-మున్సిపల్ కమిషనర్ నర్సయ్య**

**గజ్వేల్, మార్చి 5 (ప్రభాతవార్త):** మున్సిపల్ సిబ్బంది విధులను సరిగ్గా నిర్వహించాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఇంటి పన్ను వసూలు సిబ్బంది, వార్డు అధికారులతో, సానిటరీ జవాన్లతో, ట్రేడ్ లైసెన్స్ వసూలు చేయు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్‌లో ఉన్న కిందిస్థాయి సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. మున్సిపల్‌లో ఇంటిపన్ను, లైసెన్స్‌లు, ఇతర బిల్లులను వందశాతం వసూలు చేయాలన్నారు. ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోని వారిని గుర్తించి లైసెన్స్‌లు తీసుకునేవిధంగా చూడాలన్నారు. మున్సిపల్ సిబ్బంది ప్రజలకు సహకరించాలని, ఏమైనా సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని కిందిస్థాయి అధికారులకు సూచించారు.


మున్సిపల్ సిబ్బందిలో మాట్లాడుతున్న కమిషనర్ నర్సయ్య


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

## కొత్త పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలి

**వెల్దుర్తి, మార్చి 5 ప్రభాతవార్త:** మాసాయిపేట మండల పరిధిలోని చెట్ల తిమ్మాయిపల్లి గ్రామంలో సుమారు 70 మంది రైతులకు పట్టా పాస్ పుస్తకాలు ఆపారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఐలయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం మాసాయిపేట తహశీల్దార్ జ్ఞానజ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం భూ ప్రక్షాళన పేరుతో ఫారెస్ట్ ల్యాండ్‌లో ఉన్నారని 70 మంది రైతుల పట్టా పాస్ పుస్తకాలు ఆపారని, 2005లో పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వగా, సర్వే నెంబర్ 158లో చెట్ల తిమ్మాయిపల్లి శివారులో 100 ఎకరాలు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఇవ్వాలనే ఉద్దేశంతో అట్టి భూమికి సంబంధించిన పాస్ పుస్తకాలు ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. 70 మంది రైతులకు కొత్త పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చెట్ల తిమ్మాయిపల్లి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి వరి పంటలకు నీరు విడుదల చేయాలి


తహసీల్దార్ దివ్యకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

**రాయపోల్, మార్చి 5 (ప్రభాతవార్త):** యాసంగి పంటలు ఎండిపోతున్నాయని కొండపోచమ్మ ప్రాజెక్టు కాలువల ద్వారా నీటిని విడుదల చేసి పంటలను రక్షించడానికి రైతులకు సహకారం అందించాలని రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామ రైతులు మంగళవారం తహసీల్దార్ దివ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగి కాలంలో రైతులు పెద్దఎత్తున వరి సాగు చేస్తున్నారని, తీరా చూస్తే పంటలు పూర్తి కాకముందే నీటి ఎద్దడితో వరి పంటలు ఎండిపోతున్నాయన్నారు. భూగర్భ జలమట్టం తగ్గిపోయి బోర్లు కూడా పోయడంలేదన్నారు. సిద్దిపేట జిల్లాలో అనంతసాగర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులు ఉన్నప్పటికీ చుక్క నీరు రాక వరి పొలాలు బీటలు వారుతున్నాయన్నారు. కొండపోచమ్మ ప్రాజెక్టు నుంచి రామాయంపేట కెనాల్ ద్వారా రాయపోల్ మండలంలోని అంకిరెడ్డిపల్లి, రామారం, గొల్లపల్లి, రాంసాగర్, గ్రామాల చెరువులకు నీటిని తరలించడం జరిగిందని, రాంసాగర్ ఎల్లమ్మ చెరువు నుంచి నీటిని విడుదల చేస్తే లింగారెడ్డిపల్లి, విశ్వనాథ్‌పల్లి చెరువు నిండుతుందని, ఈ చెరువు ద్వారా లింగారెడ్డిపల్లి గ్రామంలో ఎండిపోయిన పొలాలకు సాగునీరు అందించవచ్చన్నారు. ఎండిపోతున్న పంటలను దృష్టిలో పెట్టుకొని తహసీల్దార్ వెంటనే నీటి విడుదలకు చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని కోరారు.

## వైశ్యసంఘం యువనేత తోట కిరణ్‌గుప్తా కాంగ్రెస్‌లో చేరిక...

**రామాయంపేట, మార్చి 5, ప్రభాతవార్త :** రామాయంపేట పట్టణ కిరాణా సంఘం మాజీ అధ్యక్షుడు, వైశ్య సంఘం యువనేత తోట కిరణ్‌గుప్తా కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం నాడు రామాయంపేట పట్టణంలోని మహంకాళి దేవాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సమక్షంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు కిరణ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అయితే కాంగ్రెస్ పార్టీలో చేరిన కిరణ్ ఇంతవరకు ఏపార్టీలో చేరకుండా స్తబ్దతగా ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రామాయంపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు శక్తిగా కృషి చేస్తానని కిరణ్ తెలిపారు. భవిష్యత్తులో చాలామంది వైశ్య సోదరులు కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు ఆయన ప్రకటించారు.

**మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు...**

రామాయంపేట మున్సిపల్ బడ్జెట్ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు ఆయన అభిమానులు , కార్యకర్తలు, నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. ఇటీవల కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న టీఆర్ఎస్ కౌన్సిలర్ దేమె యాదగిరి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ముందుగా మహంకాళి దేవాలయంలోకి వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో చైర్మెన్ సరాఫ్ పాండురంగ చారి ఆధ్వర్యంలో ఆలయ పూజారి జొన్నోజు నాగరాజుచారి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రోహిత్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ దేమె యాదగిరి, చిలుక గంగాధర్, సుందర్‌సింగ్, టీపీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, ఎంపిటిసి నాగులు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి అల్లాడి వెంకటేష్, పార్టీ నాయకులు చింతల స్వామి, దండు శివశంకర్, బైరాం కుమార్, విప్లవ్, డాకి స్వామి, ఎనిశెట్టి అశోక్‌గుప్తా, దేవుని రాజు, సుంకోజు దామోదర్, పిట్ల ప్రకాశ్, దోమకొండ యాదగిరి, బొట్ల బాబు, గొల్ల రమేష్, తార్యానాయక్, హనుమంతరావు పాల్గొన్నారు.

## సింగూరు ప్రాజెక్టు నుండి నీటి విడుదల..

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్

**కొల్చారం, మార్చి5 ప్రభాతవార్త:** సింగూరు ప్రాజెక్టు నుండి మంజీరా బ్యారేజీకి (ఘనపూర్ ఆయకట్టు) 0.4 టీఎంసీల నీటిని మంగళవారం విడుదల చేయడం జరిగిందని కొల్చారం తహశీల్దార్ గఫార్ మియా తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఔట్ ఫ్లో 1460 క్యూసెక్కులుగా ఉందని, మంజీరా నది పరివాహక ప్రాంతాల ప్రజలు, రైతులు, ముఖ్యంగా పశువులు, గొర్ల కాపరులు, చేపల వేటకు వెళ్లే వారు నదిలోకి వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు.

## అక్రమ ఇసుక రవాణాపై టాస్క్‌ఫోర్స్ దాడులు

**-ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్**

**గజ్వేల్, మార్చి 5 (ప్రభాతవార్త):** ఫిల్టర్ ఇసుక తయారుచేసి ట్రాక్టర్‌లో అక్రమ రవాణా చేస్తుండగా సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించి పట్టుకున్నారు. గజ్వేల్ మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామ శివారులో వాగులో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఫిల్టర్ ఇసుక తయారుచేసి అమ్ముతున్నారని పక్కా సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు మరియు గజ్వేల్ పోలీసులు దాడిచేసి నెంబర్ లేని ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోనున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఫిల్టర్ ఇసుక తయారుచేసి అమ్మినా అక్రమంగా దాచి ఉంచినా ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా, జూదం, పేకాట, ఇతర మత్తు పదార్థాలు విక్రయించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిసినా వెంటనే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందించాలన్నారు.


పట్టుకున్న ట్రాక్టర్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు



కట్ట మైసమ్మ గుడికి వెళ్లే దారిని ధ్వంసం చేసినట్లు చూపిస్తున్న

## కట్టమైసమ్మకు వెళ్లే దారిని ధ్వంసం చేసిన మాజీ సర్పంచ్‌ను అరెస్టు చేయాలి

**కౌడిపల్లి, మార్చి 5, ప్రభాతవార్త:** ప్రతిసారి పంటలు పండిన తర్వాత కనికాల చెరువుకట్ట మైసమ్మ తల్లికి మొక్కులు తీర్చుకోవడం వెల్మకన్నె గ్రామస్థులకు ఎన్నో ఏళ్ల నుండి వస్తున్న ఆనవాయితీ ఉండగా, జేసిబి సహాయంతో దారికి అడ్డంగా పెద్ద గోతిని తీసిన సదాశివపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బోయిని వీరయ్యపై చట్టరీత్యా చర్యలు తీసుకుని జేసిబిని సీజ్ చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్మకన్నె గ్రామ మాజీ సర్పంచ్ ఖాజీపేట రాజేందర్ తెలిపారు. సోమవారం వెల్మకన్నె గ్రామస్థులు కనికాల చెరువు కట్ట వద్దకు వచ్చి కట్టమైసమ్మ గుడికి వెళ్లే దారిని ధ్వంసం చేసిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు గ్రామాలకు ఆరాధ్యదైవమైన కట్ట మైసమ్మ గుడికి వెళ్ల కుండా ఈ నెల 2 వతేదీన సదాశివపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బోయిని వీరయ్య జేసిబీ సహాయంతో మీటర్ తోతుగా దారికి అడ్డంగా గుంత తీసి నట్లు వారు ఆరోపించారు. గ్రామస్థులు మొక్కులు తీర్చుకొనే కట్టమైసమ్మ గుడికి వెళ్లకుండా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటు జేసిబిని సీజ్ చేయాలని వెల్మకన్నె గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈయన తోపాటు బిజెపి మండల పార్టీ అధ్యక్షులు రాఖేష్, వెల్మకన్నె గ్రామ ప్రజలు వనమాల రాములు, కె. స్వామి, జే. వెంకటేశం, లచ్చయ్య, శంకర్, శ్రీధర్, బి. కృష్ణ, కె. చంద్రం, పోచయ్య తదితరలు కలరు.

## ఎంపిపిలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



ప్రజా పాలన ధరఖాస్తులు స్వీకరిస్తున్న ఇంచార్జి ఎంపిడిఓ

**న్యాల్‌కల్, మార్చి 5, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన సేవ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు అధికారులు ప్రారంభించారు. ప్రజాపాలన సేవ కేంద్రానికి చేరుకున్న ప్రజలు అందచేసిన దరఖాస్తులను ఇంచార్జి ఎంపిడిఓ సురేష్ స్వీకరించారు. ప్రజలు ప్రజా పాలన సేవ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జి ఎంపిడిఓ సురేష్ మండల ప్రజలకు సూచించారు.

## కడికాలువకు నల్లవాగు నీరు విడుదల చేయండి

**-డిఆర్‌ఓకు మాజీ ఎమ్మెల్యే వినతి**



డిఆర్‌ఓకు వినతి పత్రం అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**సిర్గాపూర్, మార్చి 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టు కుడి కాలువ నుంచి సాగు నీటిని విడుదల చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి డిఆర్‌ఓకు వినతి చేశారు. మంగళవారం డిఆర్‌ఓకు మాజీ ఎమ్మెల్యే వినతి పత్రం అందచేసిన సందర్భంగా మాట్లాడుతూ ప్రాజెక్టు కింద ఆయకట్టు గ్రామాలైన బిబిపేట్, ఖానాపూర్, కృష్ణాపూర్, కల్హేర్ గ్రామాల రైతులు నల్లవారు నుంచి వచ్చే సాగునీటిని ఆధారంగా చేసుకుని పంటలను సాగు చేస్తూ ఉంటారన్నారు. ఈసారి ఎప్పటిలాగే నీటిని విడుదల చేస్తారన్న ఆశతో రైతులు వరి, జొన్న పంటలను సాగు చేసుకుంటున్నారన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులో సరిపడా నీరు ఉన్నా నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు పంటల సాగుకు అవస్థలు పడాల్సి వస్తోందని విచారం వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోతుండటంతో రైతులు దిగాలు చెందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పంటల సాగుకు నీటిని చేయాలని, రైతులు సాగు చేస్తున్న పంటలు ఎండిపోకుండా చూడాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిఆర్‌ఓకు సూచించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్హేర్ జడ్పీటిసి సభ్యులు నరసింహారెడ్డి, డిసిసిబి డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, పంతులు, ఆయకట్టు రైతులు ఉన్నారు.

## కేతకిలో ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

**ఝరాసంగం, మార్చి 5, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో దేవాదాయ ధర్మదాయ శాఖ ప్రత్యేక అధికారి ఒకోటి రంగారావు, ఈఓ శశిధర్, రుద్రప్ప పాటిల్, సంతోష్‌పాటిల్, ప్రధాన అర్చకులు బసయ్యస్వామి, శివప్రసాద్ స్వామి, దిలీప్‌జోషి, బసయ్యస్వామి, గ్రామ భక్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందచేసిన ఆలయ ఇఓ



ఎమ్మెల్యేకు ఆహ్వాన ప్రతం అందచేస్తున్న కేతకి ఆలయ ఈఓ శశిధర్

**ఝరాసంగం, మార్చి 5, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోకి శ్రీకేతకి సంగమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నుంచి ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహోత్సవాలు ఈ నెల 13వ తేదీవరకు కొనసాగనున్నాయి. ఈ నెల 8న మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయానికి చేరుకుని ఉత్సవాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలన ఇఓ శశిధర్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావుకు జహీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కలుసుకుని శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రికను అందించారు.

## నేడు సిర్గాపూర్ రైతువేదికలో రైతులకు అవగాహన

**సిర్గాపూర్, మార్చి 5, ప్రభాతవార్త:** ఈ నెల 6వ తారీఖున మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని రైతు వేదికలో రైతులకు వీడియోఉ కాన్ఫరెన్స్ ద్వార ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11.30 గంటలకు హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, నారాయణఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పి సంజీవరెడ్డి, రాష్ట్ర స్థాయి వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొంటారన్నారు. రైతులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారి సూచించారు.

# మహా శివరాత్రి ఉత్సవాలకు ఉమాసంగమేశ్వరాలయం ముస్తాబు

**-నాలుగు రోజుల పాటు జరగనున్న జాతర ఉత్సవాలు.. పెద్ద సంఖ్యలో హాజరు కానున్న భక్తులు**



ఉమా సంగమేశ్వరాలయంలో స్వయంభు లింగం

**పెద్దశంకరంపేట, మార్చి 5 ప్రభాతవార్త:** మహా శివరాత్రి జాతర ఉత్సవాలకు మండల పరిధిలోని కొప్పోల్ ఉమా సంగమేశ్వర దేవాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ నెల 7వ తేదీ నుండి 10వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకుంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. అదేవిధంగా జాతర ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.

**ఆలయ విశిష్టత...**

మండల పరిధిలోని కొప్పోల్ ఉమా సంగమేశ్వరుడు భక్తులు కోరిన కోరికలు తీరుస్తూ భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందింది. మండల కేంద్రం నుండి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌ను ఆనుకొని ఈ ఆలయం వెలసింది. ఇక్కడి శివాలయం స్వయంభు లింగంగా ప్రసిద్ధి చెందింది. క్రీ.శ. 1341వ సంవత్సరంలో ఈ ఆలయాన్ని అప్పటి సంస్థానాధీశులు రాజా రామచంద్రారెడ్డి వంశస్తులు నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది.

**మహా శివరాత్రి ఉత్సవాలు...**

కొప్పోల్ దేవాలయంలో మహా శివరాత్రి సందర్భంగా నాలుగు రోజుల పాటు వివిధ కార్యక్రమాలను కన్నుల పండుగగా నిర్వహిస్తారు. 7వ తేదీ గురువారం పుణ్యాహవచనం, 8న శుక్రవారం రుద్రాభిషేకంతో పాటు అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకం, 9న శనివారం స్వామి కళ్యాణోత్సవంతో పాటు సాయంత్రం శకట భ్రమనోత్సవం, 10న ఆదివారం పూర్ణాహుతితో పాటు అర్ధరాత్రి రథోత్సవ కార్యక్రమంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయి.

**ఆర్టీసీ ప్రత్యేక బస్సులు...**

జాతర ఉత్సవాల సందర్భంగా ఆర్టీసీ నారాయణ ఖేడ్ డిపో పెద్దశంకరంపేట బస్టాండ్ నుండి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.



బిజెపి విజయ సంకల్ప సభకు బయిలు దేరిన నాయకులు

## విజయ సంకల్ప సభకు తరలిలిన బిజెపి శ్రేణులు

**నర్సాపూర్, మార్చి 5.ప్రభాతవార్త:** పటాన్‌చెరులో నిర్వహిస్తున్న బిజెపి విజయ సంకల్ప మహాసభను మంగళవారం బిజెపి శ్రేనులు తరలివెళ్ళారు. ఈ మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్‌లు,ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి చిన్న రమేశ్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, కౌన్సిలర్ గోడ రాజెందర్,ఓబిసి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్ద రమేశ్‌గౌడ్, కౌన్సిలర్‌లు బుచ్చేష్‌యాదవ్, సంగసాని సురేశ్, మాజీ సర్పంచ్ హెచ్‌వి. రమణారావు ఆధ్వర్యంలో నర్సాపూర్ పట్టణ బిజెపి నాయకుల, కార్యకర్తలు బారీ సొఖ్యలో వారివారికి కేటాయించ,ఇన వాహనల్లో తరిలి వేళ్ళారు. పటాన్‌చెరులో జరిగే బిజెపి విజయ సంకల్పయాత్రలో బాగంగా భహిరంగ సభకు వారు వెళుతున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడి హాజరవుతున్నందున తరిళి వెళ్ళడం జరిగింది. తెలిపారు. విజయ సంకల్ప సభకు తరలివెళ్లిన వారిలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్,ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి చిన్న రమేశ్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, కౌన్సిలర్ గోడ రాజెందర్,ఓబిసి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్ద రమేశ్‌గౌడ్,కౌన్సిలర్‌లు బుచ్చేష్‌యాదవ్,సంగసాని సురేశ్, ఎరుకలి యాదగిరి, నర్సాపూర్ అసెంబ్లీ కోకన్వీనర్ సతీష్‌యాదవ్, మాజీ సర్పంచ్ హెచ్‌వి.రమణారావు,జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి కొత్త శ్రీనివాస్‌గుప్త,ఓబిసి జిల్లా ఉపాధ్యక్షులు గుండం శంకర్,నర్సాపూర్ మండల అధ్యక్షులు నీలి నాగేశ్, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, , ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు చంద్రయ్య,శక్తి కేంద్రం ఇంచార్జి బోర్‌వెల్ రామ్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు,బిజెపి నాయకులు ,కార్యకర్తలు తదితరుల్గున్నారు.

**పెద్దశంకరంపేట మండలం నుంచి...**



ప్రధాని మోడీ సభకు తరలి వెళ్తున్న బీజేపీ నాయకులు

**పెద్దశంకరంపేట, మార్చి5 ప్రభాతవార్త:** పటాన్‌చెరులో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు మంగళవారం పెద్దశంకరంపేట మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్ ఆధ్వర్యంలో మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్ మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో 9 వేల కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు ప్రధాన మంత్రి మోడీ శంకుస్థాపన చేశారని వివరించారు. భారతీయ జనతా పార్టీతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి కేంద్రంలో భారతీయ జనతా పార్టీ 370కి పైగా పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకుని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. మండల బీజేపీ నాయకులు శ్రావణ్ కుమార్, మంగలి కృష్ణ, సంగమేశ్వర్, బుగుడాల కృష్ణ, ఆయా గ్రామాల నుండి బీజేపీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.

## ఎల్ఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నేడు ధర్నా

**జహీరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:** ఎల్ఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఈ నెల 6వ తేదీన బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని అతిథి గృహం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీనాయకులు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఐబి గెస్ట్ హౌజ్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## పేదింటి ఆడబిడ్డ పెళ్లికి పుస్తెలు, మెట్టెలు అందజేత

**నర్సాపూర్ ,మార్చి 5.ప్రభాతవార్త:** పేదింటి ఆడబిడ్డ పెళ్ళికి బిజెపి రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ తరపున పుస్తెలు, మెట్టెలను ఆ పార్టీ నేతలు అందజేయడం జరిగింది. నర్సాపూర్ మండలంలోని అచ్చంపేట గ్రామానికి చెందిన పేదవారైన నీరుడి సాయమ్మ పోచయ్య కూతురు భానుప్రియ పెళ్లికి ఆయన పుస్తె మెట్టెలను అందించారు. పుస్తెలు, మెట్టెలు అందించిన వాల్దాస్ మల్లేష్‌గౌడ్‌కు సాయమ్మ పోచయ్య దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వాల్దాస్ మల్లేష్‌గౌడ్ ను పలువురు అభినందించారు. ఈ సమయంలో అచ్చంపేట గ్రామ భూత్ అధ్యక్షులు మల్లేష్, ఉపాధ్యక్షులు గూడూరి మల్లేష్, బాలేశ్, అంజయ్య, తదితరులున్నారు

## నర్సాపూర్ పట్టణ అభివృద్ధిక సహకరించాలి

**మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్**

**నర్సాపూర్, మార్చి 5, ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణ అభివృద్ధికి అధికారులు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ అన్నారు.మంగళవారం నర్సాపూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిఫల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ అధ్యక్షతనలో నర్సాపూర్ పట్టణ అభివృద్ధి పై వార్డు అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సమావేశంలో మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సమక్షంలోపట్టణంలోని వివిద వార్డుల్లో గల పారిశుధ్య పనులు, మంచినీటి సరఫరా,వీధిదీపాల నిర్వహణ తదితర అంశాల పై చర్చించారు. అంతేగాక పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పై సమీక్షా నిర్వహించి వార్డు ల వారిగా చేయవల్సిన అభివృద్ధి పనుల వివరాలను సేకరించారు. ఈ మేరకు ఈ అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయుటకు వార్డు అధికారులు సహకరించాలని మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మదుసూధన్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్



దామర్‌గిద్దలో సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

## గ్రామాల్లో సిసి రోడ్డు పనులకు శ్రీకారం

**నాగల్‌గిద్ద, మార్చి 5, ప్రభాతవార్త:** మండలంలోని దామర్‌గిద్ద, గోందేగావ్ గ్రామాల్లో సిసి రోడ్డు నిర్మాణానికి మంగళవారం భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఆయా గ్రామాల్లో 5 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఎంపిటిసి సభ్యులు పండరి నాథ్ రావు, మాజీ సర్పంచ్ శాంతయ్య స్వామిలు భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిపోయాయని విచారం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ హయాంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చురుకుగా కొనసాగడం తథ్యమన్నారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## ధర్పల్లి పాఠశాలలో స్వయం పాలన



ధర్పల్లిలో స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు

**చిన్నశంకరంపేట,మార్చి 5,ప్రభాతవార్త:** మండల పరిధి ధర్పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. డిఈవోగా గిరిధర్, ఎమ్ఈవోగా ప్రణిత్, ప్రధానోపధ్యాయులుగా నందితలు, ఉపాధ్యాయులుగా భవ్య, దీక్షిత, వర్షిణి, భానుప్రియ, నందకిషోర్, చందు, ఆదిత్య, దీపిక, కావ్య, గాయత్రి, స్వాతిలు వ్యవహరించారు. ప్రధానోపధ్యాయులు రాజు,సాయిరెడ్డి, జడ్పిహెచ్ఎస్ హెచ్ఎం శ్రీనివాస రావు, ఉపాధ్యాయులు సురేష్, పద్మ, సౌజన్య, అనిల్ ఉన్నారు.

## ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

**-ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీనర్సింలు**



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీనర్సింలు

**కొల్చారం, మార్చి 5 ప్రభాతవార్త:** ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న ప్పటికీ ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ పథకాలు అమలు కానటువంటి అర్హులు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కొల్చారం ఇంచార్జి ఎంపీడీవో లక్ష్మీనర్సింలు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రజాపాలన కౌంటర్ ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఉంటుందని ఆయన వివరించారు.

## ఘనంగా మల్లన్న జాతర ఉత్సవాలు



మల్లన్న జాతర ఉత్సవాల్లో పాల్గొన్న టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి

**వెల్దుర్తి, మార్చి5 ప్రభాతవార్త:** మండల పరిధిలోని శేరిలా గ్రామంలో గత రెండు రోజుల నుండి మల్లన్న స్వామి జారత ఉత్సవాలను యాదవులు ఘనంగా జరుపుకుంటున్నారు. మంగళవారం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి మల్లన్న జాతర ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా జాతర ఉత్సవాలు జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఆ భగవంతుని కృపతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేష్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, మల్లేశం, పోతిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన

**-మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి**

**కొల్చారం, మార్చి 5 ప్రభాతవార్త:**

రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ దృశ్య శ్రవణ విధానం ద్వారా రైతులకు ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన ప్రారంభోత్సవ కార్యక్రమం నేడు ఉదయం 11 గంటలకు హైదరాబాద్ నుండి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేత ప్రారంభించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమనమల నాగేశ్వరరావు, రాష్ట్ర స్థాయి వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొంటారని, మండల పరిషత్ అధికారి, తహశీల్దార్, హర్టికల్చర్ అధికారి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, నీటి పారుదల శాఖ ఇంజనీర్, విద్యుత్ శాఖ ఇంజనీర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ, ప్రాథమిక సహకార సంఘం సీఈవోలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.



ప్రధాన మోడీకి స్వాగతం పలుకుతున్న జహీరాబాద్ బిజెపి నాయకులు

## ప్రధాన మంత్రికి స్వాగతం పలికిన బిజెపి నేతలు

**జహీరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:** పటాన్‌చెరులో నిర్వహించిన విజయ సంకల్ప సభకు హాజరైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి జహీరాబాద్ భారతీయ జనతా పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్ద బిజెపి రాష్ట్ర కిసాన్ సెల్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ అరుణ కౌలాస్, బిసి బిజెపి ఓబిసి రాష్ట్ర నాయకులు సుధీర్ బండారిలు నరేంద్ర మోడీకి స్వాగతం పలికారు.

## మోడీ సభకు తరలివెళ్లిన బిజెపి నాయకులు



అల్లాదుర్గం నుంచి మోడీ సభకు వెళుతున్న బిజెపి నాయకులు

**అల్లాదుర్గం, మార్చి 5, ప్రభాతవార్త:** జిల్లాలోని పటాన్‌చెరులో మంగళవారం నిర్వహించిన విజయ సంకల్ప సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి భారతీయ జనతా పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. విజయసంకల్ప సభకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హాజరవుతుండటంతో ఆయా గ్రామాల నాయకులు, మండల నాయకులు ప్రధాని మోడీకి అనుకూలంగా నినాదాలు చేస్తూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమానికి తరలివెళ్లిన వారిలో పార్టీ మండల అధ్యక్షులు గౌరవెల్లి యాదగిరి, అందోల్ కో-కన్వీనర్ రాములు, బిజేవైఎం మండల అధ్యక్షులు రమేష్, గడిపెద్దాపూర్ పట్టణ అధ్యక్షులు నందమూరి, అల్లాదుర్గం మండల ప్రధాన కార్యదర్శి సాయిలు గౌడ్, వెంకట్రావుపేట, రెడ్డిపల్లి గ్రామాల అధ్యక్షులు కిష్టయ్య, సంగమేశ్వర్ తదితరులు ఉన్నారు.

**ఝరాసంగం మండలం నుంచి...**



మోడీ సభకు తరలివెళుతున్న బిజెపి నాయకులు

**ఝరాసంగం, మార్చి 5, ప్రభాతవార్త:** పటాన్‌చెరులో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ విజయ సంకల్ప సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి భారతీయ జనతా పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమానికి సంగమేశ్వర్ పాటిల్, శ్రీనివాస్‌పాటిల్, శివకుమార్ పాటిల్, మోహన్ పాటిల్, సతీస్‌స్వామి, శ్రవణ్ సింగ్ ఠాకూర్, కే నాగరాజు పాటిల్, గాళప్ప పాటిల్, జగన్ పాటిల్, నర్సింహారెడ్డి, సంతోష్ నాయక్, ప్రశాంత్ గౌడ్, రవీందర్ యాదవ్, ఈశ్వరయ్య, సంగమేశ్వర్ పాటిల్‌లు ప్రధాన మంత్రి మోడీకి అనకూలంగా నినాదాలు చేస్తూ సభకు తరలివెళ్లారు.

## క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే

**జహీరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్న ప్రశాంత్, కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. కిమ్స్ ఆసుపత్రికి ఎమ్మెల్యే, నాయకులు గాలి అనిల్‌కుమార్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గుండప్పలు క్షతగాత్రుల కుటుంబ సభ్యులకు 4లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఆర్థిక సహాయం అందించి అండగా ఉన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యేలకు ప్రశాంత్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## చెరుకు రైతులకు బకాయి బిల్లులు

**జహీరాబాద్, మార్చి 5, ప్రభాతవార్త:** చెరుకు రైతులకు బకాయిలను సోమవారం 1 కోటి 70 లక్షల రూపాయలను ఖాతాల్లోకి క్రెడిట్ చేసినట్లు ట్రైడెంట్ చక్కర కర్మాగారం డైరెక్టర్ ఖిజర్ యాపై తెలిపారు. కర్మాగారానికి చెరుకు తోలని ప్రతి రైతుకు బకాయి బిల్లులు చెల్లించడం పూర్తయిందని, 9 మంది రైతుల బ్యాంక్ ఖాతా వివరాలు సక్రమంగా లేకపోవడంతో వారికి మాత్రమే 1 లక్ష 83వేల 38రూపాలను బకాయి బిల్లులు చెల్లించలేదన్నారు. బకాయి బిల్లులు అందుకోని 9 మంది రైతులు తమ బ్యాంక్ ఖాతా, పట్టెదారు పాసుపుస్తకం జికార్సులను అందిస్తే వెంటనే బకాయి బిల్లులు వారికి సైతం అందిస్తామన్నారు. పూర్తి వివరాలకు పరిశ్రమ సిబ్బంది నర్సింలు (9908091734)ను సంప్రదించాలన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**చిన్నశంకరంపేట, మార్చి 5, ప్రభాతవార్త:** మద్యానికి బానిసై ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధి గవ్వలపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ నారాయణగౌడ్ కథనం ప్రకారం... చెన్నాయిపల్లి గ్రామానికి చెందిన నర్సింలు (50), వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడని కుటుంబసభ్యులు తెలిపారు. సోమవారం సాయంత్రం గవ్వలపల్లిలోని సంతకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రైన ఇంటికి తిరిగి రాకపోయేసరికి నర్సింలు కోసం కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లలో గాలించినా అతని ఆచూకి లభించలేదు. మంగళవారం ఉదయం రమేష్ అనే రైతు పొలం వద్దకు వెళ్తుండగా ఓ మద్యం దుకాణం వెనక నర్సింలు మృతదేహం కనిపించగా, పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతునికి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఇద్దరు వాహనదారులకు జైలుశిక్ష

**అల్లాదుర్గం, మార్చి 5, ప్రభాతవార్త:** పోలీసు ఠాణాపరిధిలో మద్యం తాగి వాహనాలను తోలిన ఇద్దరు డ్రైవర్లకు జైలుశిక్షను విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డ కథనం ప్రకారం... డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 14 మందిలో ఇద్దరకి రెండు రోజులపాటు జైలుశిక్ష, 12 మందికి ఒకొక్కరికి రూ. 2వేల చొప్పున జరిమాన విధిస్తూ మంగళవారం మెదకన స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి తీర్పును వెలువరించినట్లు పేర్కొన్నారు. వాహనాల తనిఖీ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన 14 మందిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా న్యామూర్తి తీర్పును చెప్పినట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి వివరించారు.



డ్రంక్ అండ్ డ్రైవ్ బాధితలును అదుపులోకి తీసుకున్న పోలీసులు